
మన ఎమ్మెల్యేలు గళం విప్పారు.. కానీ జిల్లాలోని కీలక పథకాలు, ప్రాజెక్టుల విషయంలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగిశాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ (2025-26) ఈ సమావేశాల్లోనే పెట్టారు. అలా అత్యంత ప్రాధాన్యత ఉండగా ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ లక్ష్యాలు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, జిల్లాల వారీ ప్రత్యేక దృష్టిపెట్టే అనేక అంశాలపై ప్రభుత్వం ఈ సమావేశాలలో స్పష్టత ఇచ్చింది. అలా అన్ని రకాలుగా అత్యంత ప్రాధాన్యతగా రెండు వారాలు సాగిన సమావేశాల్లో జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు పలు విషయాలు మాట్లాడారు. అయితే ఉమ్మడి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చ జరిగేలా చేయడం, నిధులు రాబట్టడంలో వెనుకబడ్డారనే చెప్పాలి.





రాష్ట్రప్రభుత్వం తరపున సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా శాఖాపరమైన అంశాల్లోనూ, ఇతర సంక్షేమ పథకాల అమలు, ఇతరత్రా చర్చల సందర్భంగా ఇటు శాసనసభలో అటు శాసనమండలిలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి క్రియాశీలకంగానే వ్యవహరించారు. ప్రభుత్వ విధానాలను, తన గళం ద్వారా బలంగా వినిపించారు.



వెలిగొండపై ప్రశ్నించలేకపోయారు..



జిల్లాలో మౌలికరంగాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై సభలో గళం విప్పడంలో మాత్రం మన ఎమ్మెల్యేలు వెనుకబడ్డారు. ప్రధానంగా జిల్లా అభివృద్ధికి కీలకమైన వెలిగొండ ప్రాజెక్టుకు అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు సాధించలేకపోయారు. ఈ ప్రభుత్వం వచ్చాక తొమ్మిదినెలల కాలానికి (2024-25) బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టుకు రూ.399కోట్లు కేటాయించగా ఈసారి (2025-26) కేవలం రూ.309 కోట్లు మాత్రమే ఇచ్చారు. నిజానికి రానున్న ఏడాదికి కనీసం రూ.1,500 కోట్లు అయినా ఖర్చుచేస్తేనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2026 జూన్‌కు తొలిదశ పూర్తయ్యేది. అందరూ ఆమేర నిధులు ఇస్తారని ఆశించారు. చివరకు నిధుల కేటాయింపు దారుణంగా ఉంది. ఆ పరిస్థితి సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కేటాయింపులు పెంచేలా చేయడంలో కనీసం విడిగా సీఎంను, సంబంధిత మంత్రులను కలిసి ఒప్పించడంలో ఎమ్మెల్యేలు ప్రయత్నం చేయలేదు.

గళం విప్పారు కానీ..
గట్టిధనమేదీ?

స్థానిక అంశాలు, రాష్ట్రస్థాయి పథకాలపై చర్చకే పరిమితం

- జిల్లా ఉమ్మడి పథకాల ఫోకస్‌లో విఫలం
- వెలిగొండ నిధులు తగ్గినా స్పందన శూన్యం
- ఇతర అంశాల్లోనూ అదే పరిస్థితి
- ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- వైసీపీ ఎమ్మెల్యేలు పూర్తిగా గైర్హాజరు

ఒంగోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గతనెల 24న ప్రారంభమైన ఈ శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగిశాయి. రానున్న ఆర్థిక సంవత్సరం(2025-26) బడ్జెట్ ప్రతిపాదనలు గతనెల 28న సభలో ప్రవేశపెట్టగా రెండు వారాలు ఆయా అంశాలపై చర్చలు సాగాయి. జిల్లాలో ఎనిమిది మంది శాసనసభ్యులు ఉండగా అధికార టీడీపీ నుంచి రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామితో పాటు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్, అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి ఉండగా వైసీపీ నుంచి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,

మిగతా 6లో...



బయోగ్యాస్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు

రిలయన్స్ బయోగ్యాస్ భూమిపూజకు ఏర్పాట్లు

పీసీపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఇర్లపాడు రెవెన్యూ వెంగళాయపల్లి సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం సర్వేనెంబరు 652లో 475.57 ఎకరాల భూమిని రిలయన్స్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. ఏప్రిల్‌లో ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. వెంగళాయపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రతిపాదిత స్థలం వరకు మౌలికంగా అవసరమైన రోడ్డు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాటుచేయాలని పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ లక్ష్మీరాజేష్ వెంగళాయపల్లి నుంచి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న భూమి వరకు రోడ్డు వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పరిశీలించారు. ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎక్స్‌కవేటర్‌లతో జంగిల్ క్లియరెన్స్ చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య




రాచకొండ శ్రీను(ఫైల్)

తర్లుపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం తర్లుపాడు మండలం పోతలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ శ్రీను(50) తనకున్న 4 ఎకరాల భూమితో పాటు మరో 2 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, టమాటా, కంది పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా 3 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. వరుసగా మూడేళ్ల నుంచి వేసిన పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడులు రాలేదు. వచ్చిన కొద్దిపాటి పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పులయ్యాయి. ఇటీవల మిర్చి బస్తాలను యార్డుకు తీసుకెళ్లగా సరైన ధర పలకలేదు. దీంతో అయినకాడికి అమ్ముకుని వచ్చాడు. విషయం తెలిసిన అప్పులిచ్చినవారు బాకీ తీర్చాలని గట్టిగా ఒత్తిడి చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో బుధవారం రాత్రి మిర్చికి పిచికారీ చేసేందుకు తెచ్చుకున్న పురుగు మందును తాగాడు. గంట తర్వాత కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన మార్కాపురంలోని ఓ ప్రైవేట్ అనుపత్రికి తీసు

మిగతా 6లో...

పిల్లల ఉసురు తీసిన చిన్న చెరువు



చెరువులో పడి అన్నదమ్ముల మృతి

కురిచేడులో విషాద ఛాయలు



పిల్లల మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబసభ్యులు

కురిచేడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి అన్నదమ్ములు మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం కురిచేడులోని పడమర దళితవాడలో చోటుచేసుకుంది. బత్తుల నరసింహులు కల్పన దంపతుల కుమారులు అభి (10), పాల్ (8) స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5, 3వ తరగతులు చదువుతున్నారు. సాయంత్రం వారింటికి దగ్గరలో ఉన్న చిన్న చెరువుకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తూ అభి చెరువులో జారి పడిపోయాడు. దీనిని గమనించిన తమ్ముడు పాల్ పరుగున తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్న మరో బాలుడిని తీసుకుని చెరువు వద్దకు వచ్చాడు. అన్న కనపడకపోవడంతో రక్షిస్తానంటూ చెరువులోకి దూకబోయాడు. పక్కనే ఉన్న పిల్లవాడు వారిస్తున్నా వినకుండా పాల్ సైతం అన్నకోసం చెరువులోకి దూకి నీటిలో మునిగిపోయాడు. వెంటనే పక్కనే ఉన్న బాలుడు ఈ విషయాన్ని పిల్లల కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వెంటనే వెళ్లి చెరువులో వెతికి అన్నదమ్ముల మృతదేహాలను బయటకు తీశారు. ఇద్దరు పిల్లల

మిగతా 6లో...

8 ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు

- 27న నిర్వహణ
- ప్రత్యేకాధికారుల నియామకం

7

సోలార్ ప్లేట్ల చోరీ ముఠా అరెస్ట్

- మోటర్, రూ.85వేల సొత్తు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య

7

మూడేళ్ల బాలుడిని హత్య చేసిన తండ్రికి జీవితఖైదు

- రూ.10వేలు జరిమానా విధించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి

మెయిన్‌లో..

చేపల కోసం వెళ్లి యువకుడి మృతి

7

ఏఆర్ ఎస్ఐ రవి సస్పెన్షన్

- తాలూకా ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన వైనం
- చర్యలు తీసుకుంటూ ఐజీ ఉత్తర్వులు

ఒంగోలు క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాను సివిల్ ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన ఏఆర్ ఎస్ఐ కే.రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసు శాఖలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్ ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్లి తాను ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నానని, అధికారులకు గెట్ టుగెదర్ కార్యక్రమం ఉందని, అందుకు రూ.2 లక్షలు నగదు కావాలని కోరాడు. కళాశాల యజమాని రూ.2లక్షలు ఇచ్చారు. కొద్దిరోజులు తర్వాత ఈ విషయం కళాశాల యజమాని, తాలూకా సీఐకి తెలిపారు. ఫోన్ నంబరు ఆధారంగా ఏఆర్ ఎస్ఐ రవికుమార్ అని తేల్చారు. ఈ మేరకు సీఐ అజయ్‌కుమార్ ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాఖాపరమైన విచారణ చేసిన అనంతరం గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి నివేదిక అందజేశారు. ఆయన ఏఆర్ ఎస్సై రవికుమార్‌ను సస్పెండ్ చేశారు.



అగ్నికి తగలబడుతున్న కంది పంట

కంది పంట అగ్నికి ఆహుతి

- ఫైర్ ఇంజన్లకు అదుపుకాని మంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాపు మీద ఉన్న కంది పంట ప్రమాదవశాత్తూ మంటలకు దగ్ధమైంది. గురువారం మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో కంది పంటకు అనుకోకుండా మంటలు అంటుకున్నాయి. సుమారు 150 ఎకరాల్లో కంది పంట అగ్నికి ఆహుతి అయ్యింది. మంటలను అదుపు చేసేందుకు కనిగిరి, కందుకూరు నుంచి ఫైర్ ఇంజన్లు యత్నించినా సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కంది క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో కంది కోతలు ప్రారంభిస్తున్న తరుణంలో ఇలా జరగటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ.25 వేలు ఖర్చు పెట్టామని రైతులు పేర్కొన్నారు. అగ్నికి ఆహుతి అయిన కంది పంటను తహసీల్దార్, మండల వ్యవసాయా ధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మండల తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, నాయకులు గోళ్ల వీరబాబు, నరసింహారావు, బాస్కరరావు, రమణయ్య పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. దగ్ధమైన పంటను తహసీల్దార్ రమణరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.26	సహర్: 4.52
(శుక్రవారం సాయంత్రం)	(శనివారం ఉదయం)

వెలిగొండ ప్యాకేజీ-4కు రూ.282.33 కోట్ల అదనపు నిధులు

- అధికంగా ఆయకట్టు, కీలక పనులు ఇందులోనే..



ఒంగోలు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ప్యాకేజీ-4 పనులకు రూ.282.33 కోట్లు అదనపు నిధులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించి పరిపాలనా ఆమోదం తెలియజేస్తూ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జీ.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు పరిధిలో మూడొంతులు ఆయకట్టుకు నీరందించే తూర్పు ప్రధాన కాలువ, కాకర్ల డ్యామ్ నిర్మాణం, పలు మేజర్ కాలువలు, చిన్న, పెద్ద రిజర్వాయర్, అధిక సంఖ్యలో బ్రిడ్జిలు, చప్టాలు ఈ ప్యాకేజీలోనే ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పనులను ఏడు ప్యాకేజీలుగా విభజించి చేస్తున్న విషయం విదితమే. తొలిదశ పనులకు మూడు ప్యాకేజీలు పూర్తిగా, నాల్గవ ప్యాకేజీలో కొంతభాగం ఉన్నాయి. రెండవ దశలో ప్యాకేజీలో మిగిలిన పనులతోపాటు 5, 6, 7 ప్యాకేజీలు ఉన్నాయి. జిల్లాలోని కనిగిరి, గిద్దలూరు, మార్కాపురంలోని కొంతభాగం అలాగే నెల్లూరు, కడప జిల్లాల ఆయకట్టుకు నీరిచ్చే ప్రధాన పనులు అన్నీ 4వ ప్యాకేజీలో ఉండగా 2005లో తొలిదశ పనులకు శ్రీకారం చుట్టారు.

అందులో భాగంగా ప్యాకేజీ 4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణానికి రూ.39.78 కోట్లు ఇచ్చి పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అనంతరం లింకు కాలువలు, చప్టాలు, బ్రిడ్జిలు, హెడ్ రెగ్యులేటరీల నిర్మాణాలు, ఇతర పనుల కోసం 2005-06లో సుమారు రూ.206.80 కోట్లు, 2008-09లో మరో రూ.212.61 కోట్లు వెరసి మొత్తం ఈ ప్యాకేజీ కోసం రూ.482.45 కోట్లకు అనుమతులు ఇచ్చారు. తదనుగుణంగా పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణం పూర్తయింది. తొలిదశలో ఈ ప్యాకేజీలో 44.62 కి.మీ తూర్పు ప్రధాన కాలువ తవ్వకం చేయాల్సి ఉండగా 99శాతం పూర్తయింది. రెండవ దశకు సంబంధించి చాలా పనులు చేయాల్సి రాగా ప్యాకేజీ-4 పనులు పూర్తికి గతంలో దాదాపు 15ఏళ్ల క్రితం నాటి ధరల ప్రకారం వేసిన అంచనాలు ఉన్నాయి. పనుల్లో అధిక భాగం ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో సవరించిన అంచనాల ప్రకారం ప్యాకేజీ మొత్తాన్ని రూ.764.79 కోట్లకు ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రతిపాదనలను పరిశీలించి గతంలో అనుమతులు ఉన్న రూ.482.50 కోట్లు పోను అదనంగా రూ.282.33 కోట్లుకు అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

రేపు జిల్లాస్థాయి హాకీ జట్ల ఎంపికలు

సంతనూతలపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 22వ తేదీన జిల్లా స్థాయి బాలబాలికల హాకీ జట్ల ఎంపికలు జరగనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపిక పోటీలకు వచ్చేటపుడు జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని ఉదయం 9గంటలకు క్రీడామైదానం వద్దకు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు పీఈటీ టి.రవికుమార్ 9951578357 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వేద పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఆకుమల్ల విశ్వరూపచార్య గురువు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వేద సంస్కృత పాఠశాలలో వి శ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి గురువారం ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 16 సంవత్సరాలలోపు ఉన్న విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వాస్తు జ్యోతిష్యం, పంచాంగ పరిజ్ఞానం, ముహూర్త భాగం, మనుసూత్ర ప్రయోగం, సంస్కృతం, పౌరోహితం తదితర కోర్సులకు మూడు సంవత్సరాల కాల పరిమితిలో ఉచిత భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేసి నేర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అసక్తి కలిగిన విద్యార్థులు 9542920400 నెంబరును సంప్రదించి 30వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవాలని కోరారు.

మహిళకు గాయాలు

మార్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వెనుక వస్తున్న వాహనం స్కూటీని ఢీకొట్టడంతో మహిళ గాయపడింది. ఎంఎల్ ఏపీ కంపెనీ క్వార్టర్సులో ఉంటున్న మాధవీలత వ్యక్తిగత పనులు నిమిత్తం కుమారుడితో కలిసి స్కూటీపై చిలకలూరిపేట వెళ్లి వస్తున్నారు. ఇంటూరి ఫంక్షన్ హాలు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాధవీలత రోడ్డుపై పడి గాయపడ్డారు. ఆమెను హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు చెక్కులతో ఉన్న లారీ మీద నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పల్నాడు జిల్లా, చిలకలూరిపేటలోని సంజీవ్ నగర్‌కు చెందిన కొచ్చెర్ల అజయ్‌సాగర్ (20) మరో నలుగురు పర్చూరు మండలం పెద్దవారిపాలెంలో బుధవారం కూలి పనికి వచ్చారు. లారీలో పొగాకు చెక్కులు వేసిన అనంతరం పైభాగంలో కూర్చున్న సాగర్ లారీ కదిలిన సమయంలో కిందపడి గాయపడ్డాడు. క్షతగ్రాత్రున్ని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనే వారికి రిజర్వేషన్‌లు

వేటపాలెం(చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తమంగా రాణిస్తే వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యాన్ని అమలు చేస్తారని కెప్టెన్ చైతన్య, శిక్షకులు కర్ణ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శేఖరరావు ఆధ్వర్యంలో స్కౌట్స్, అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ శిక్షణలో పాల్గనడం వలన దేశభక్తి,వ్యక్తులపై గౌరవం పెరుగుతుందన్నారు.

గ్రానైట్ అక్రమ రవాణాపై మెరుపుదాడులు

● నాలుగు వాహనాలు సీజ్



పట్టుబడిన గ్రానైట్ ట్రాలీ, లారీ వద్ద అధికారులు

చీమకుర్తి, మార్చి20(ఆంధ్రజ్యోతి) : 'బిల్లులేవ్...మామూళ్లే' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గనులశాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు స్పందించారు. బిల్లులు లేకుండా గ్రానైట్ ముడి రాళ్లను క్వారీల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలపై మెరుపు దాడులు జరిపారు. గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బిల్లులు లేకుండా రాయిని తీసుకెళ్తున్న నాలుగు వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను ఏపీఎండీసీకి తరలించారు. కాగా అధికారులు మెరుపుదాడులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న అక్రమ రవాణాదారులు మేల్కొని ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేయటం గమనార్హం. అధికారులు తనిఖీల నేపథ్యంలో ఎందుకు వచ్చిన గొడవ అనుకున్న రవాణాదారులు బిల్లులు ఉన్నా కూడా కొంతమంది రవాణా నిలిపివేయటం విశేషం. ఇదే విధంగా అక్రమార్కులపై అనునిత్యం నిఘా ఉంచి గ్రానైట్ అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రాజీవ్ స్వగృహాలకు మోక్షమెప్పుడో?

సామాన్యులకు సొంతింటిని అందించేందుకు

2008లో నిర్మాణాలు ప్రారంభం

50 ఎకరాల్లో 598 ఇళ్లకు శ్రీకారం

ఎన్నో అవాంతరాలతో అప్పుడప్పుడూ నిర్మాణాలు

402 ప్లాట్లకు కలగని మోక్షం,

176 ప్లాట్ల విక్రయాలు

వేటపాలెం (చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీడ అనేది కచ్చితంగా ఉండాల్సిన కనీస అవసరం. అయితే దీనిని ఎంచుకునే మార్గాలు మాత్రం వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. అయితే అరకొర ఉపాధి అవకాశాలతో బతుకు బండి లాగేవాళ్లకు కనీసం గంజి నీళ్లు, సొంత చిన్న ఇల్లు జీవితంలో కలగానే మిగులుతుంది. ఈక్రమంలో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు సొంతిల్లును అందిస్తామని, ఇంటి నిర్మాణాలు చేసి ఆక్షన్‌ల ద్వారా ఇల్లు అందిస్తామని ప్రకటించింది. అయితే దీంతో చిగురించిన ఆశలు, రెట్టించిన ఉత్సాహంతో అప్పట్లో ఆక్షన్‌లో పాల్గొనేందుకు మీ-సేవల ద్వారా నామమాత్రపు చెల్లింపును ప్రవేశ పెట్టడంతో అప్పట్లో చీరాల పరిధిలో సుమారు 15 రోజుల పాటు సామాన్య ప్రజలు బారులు తీరారు. పెద్ద ఎత్తున అర్జీలను అందజేశారు.



బేస్‌మట్టం స్థాయిలోనే నిలిచిన నిర్మాణాలు

అనుకున్నది ఒక్కటి.. అయినది మరొక్కటి

అయితే అప్పట్లో ప్రజలు చీరాల పట్టణానికి సమీపం లేదా ప్రజల నివాసాల మధ్య ఇళ్ల ఏర్పాటు జరుతాయని ఆశాభావంతో అర్జీలకు పోటీ పడ్డారు. కానీ తీరా గృహ నిర్మాణాలు వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం వద్ద జరగడంతో నిరాశతో చాలామంది ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన నగదును వెనక్కి తీసుకున్నారు. ఈక్రమంలోనే అధికారులు నిర్దేసించిన స్థలంపై అనుకూలత లేని ప్రజ ల్లో చాలా మంది గృహా ల ఆక్షన్‌లకు కూడా దూరంగా ఉ న్నారు. దీంతో అప్పట్లోనే నిర్మాణాలపై ప్రజల్లో భిన్న స్వరాలు వినిపించాయి.

నిర్మాణాలు..ఆక్షన్‌లు ఇలా

అయితే తలపెట్టిన లక్ష్యంతో అధికారులు చల్లారెడ్డిపాలెం పంచాయితిలో సుమారు 50ఎకరాల విస్తీర్ణంలో వివిధ దశల్లో 598 ప్లాట్లు సుమారు రూ.16కోట్ల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఆదిలోనే ఆటంకం ఏర్పడింది. నిర్దేసించిన స్థలంలో సుమారు ఎకరన్నర భూమి కోర్టు పరిధిలోకి చేరింది. అప్పటి నుంచే ప్రారంభమైన వివిధ సమస్యల కారణంగా నిర్మాణాలు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని ప్లాస్టింగ్, పెయింటింగ్ వరకు పూర్తి చేయగా, మరి కొన్ని బేస్‌మట్టంలోనే ఆగిపోయాయి. అయితే 2018లో అప్పటి ప్రభుత్వం జీవె నెంబర్ 243 విడుదల చేసి ఆక్షన్‌లు నిర్వహించాలని ఆదేసించింది. దీంతో ఇప్పటిక నిర్వహించిన మూడు పాటల్లో 176 వరకు అమ్మకాలు జరగ్గా, 400కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తానికి ధర అధికం, స్థలం సుదూరం కావడంతో ప్రజలు వీటికి దూ రంగా ఉంటున్నారు. దీంతో నిర్మాణాలు సాగక లక్ష్యం నీరుగారుతోంది. టీడీపీ కూటమి అయినా దృష్టి సారించి శిథిలమవుతున్న భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్తులను కాపాడడంతోపాటు వాటిని పేదలకు అప్పగించి సొంతింటి కలను నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

ఉల్లాస్ సాక్షరతా కార్యక్రమంపై అవగాహన



మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు మనోరంజన్

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్యాశాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమంపై వెలుగు కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్యాశాఖ పర్యవేక్షకుడు కొణిదల మనోరంజన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువురాని వయోజనులకు (15, అంతకంటే ఎక్కువ వయస్సు) గల వారికి పనుల్లో ఉపయోగపడేలా చదవడం, రాయడం, లెక్కలు చేసుకోవటం నేర్పటమే ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయ బృందాలలో మొదటి విడతగా చదువురాని 590 మంది మహిళలను గుర్తించి వారికి, వారి బృందాలలోనే చదువుకున్న మహిళలతోనే చదువు నేర్పించడం జరిగిందన్నారు. వయోజన విద్య ద్వారా అక్షరాశ్యత సాధించిన వారికి ఎన్ఐవోఎస్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను కూడా అం దజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కొండి రామకృష్ణ, సీసీలు, వివిధ గ్రామాల యానిమేటర్లు, టీచర్స్ పాల్గొన్నారు.

కారంచేడు : కారంచేడు వెలుగు కార్యాలయంలో ఉల్లాస్‌పై ఏపీఎం టి.మోహన్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలో వసతుల పరిశీలన

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ముంపు గ్రామమైన ధేనువకొండ పునరావాసకాలనీలలో ఒకటైన దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీని గురువారం గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) పరిశీలించారు. పునరావాస కాలనీలో ప్రస్తుతం ఉన్న వసతులు, కల్పించాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇంకా ఇళ్ల స్థలాల కేటాయింపు జరగని కుటుంబాలు, శ్మశానవాటిక సమస్య, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను గ్రామస్థులను వివరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరి, టీడీపీ నేతలు జొన్నలగడ్డ కృష్ణ, నలజల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ ఆంజనేయులు, చక్రవరం అంజంరాజు, అన్నాబత్తిన హనుమంతరావు, కొండలు, జొన్నలగడ్డ పేరయ్య, గుంజి గోవింద్ పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్నస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

ఇప్పటికే పలు శాఖలపై స్పష్టత

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల కోసం పలువురు ఆశావాహులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే అత్యధిక నామినేటెడ్ పదవులపై ఆయా నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కాలం దాటడంతో ఆశావాహులు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో ప్రధానంగా రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి పదవులతో పాటు 31 సొసైటీలకు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మిగిలిన పలు దేవాలయాలకు కూడా ధర్మకర్తల మండళ్లు నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అయితే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నామినేటెడ్ పదవులపై ఆయా మండలాల, గ్రామాల నేతలతో చర్చించి పూర్తి స్థాయిలో కసరత్తు చేసి ఒక స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది.

అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో కొరిశపాడు మండలానికి కేటాయించే అవకాశం కనిపిస్తుంది. సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓసీ జనరల్‌కు రిజర్వు కావడంతో సంతమాగులూరు మండలంలోని టీడీపీ నేతకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇక డైరెక్టర్‌లుగా అన్ని సామాజిక వర్గాలకు ప్రధాన్యం ఇస్తూ భర్తీ చేసే అవకాశం ఉంది. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆనవాయితీగా వస్తున్న ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించే క్రమంలో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అద్దంకి పట్టణ నేతకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్‌గా పట్టణంలోని వడ్డెర సామాజికవర్గానికి చాన్స్ దక్కనుంది. సుదీర్ఘ కాలం నుంచి టీడీపీకి సేవలందిస్తున్న నేతకు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆయా నేతలకు పదవులపై స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గంలో మొత్తం 31 సొసైటీలు ఉండగా, ఇంకా ఎన్నికలు జరగకపోవడంతో త్రీమెన్ కమిటీలను నియమించనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని సొసైటీలకు జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. కొద్ది సొసైటీల విషయంలో ఆయా గ్రామాల నేతలు పోటీపడ్డప్పటికీ చర్చించి అందరి ఆమోదయోగ్యంగా జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. బల్లికురవ, రావినూతల, వెల్లలచెరువు సొసైటీలకు ఎక్కువ మంది పోటీ పడినట్లు తెలుస్తోంది. ఎవరికి వారే మంత్రి గొట్టిపాటిని కలిసి తమకు అవకాశం కల్పించాలని తీవ్ర ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం. బల్లికురవ సొసైటీ విషయంలో ఇద్దరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. త్వరలో అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేసే అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. దీంతో 9 నెలలుగా ఎదురు చూస్తున్న నేతలకు త్వరలో పదవులు దక్కే అవకాశం కనిపిస్తుంది.



అద్దంకి మార్కెట్ యార్డ్ కార్యాలయం

టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితా విడుదల

అవీఇవీ

● 24 వరకు అభ్యంతరాల స్వీకరణ ● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులకు సంబంధించిన టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉపాధ్యాయుల సమాంతర వ్యవస్థ(టిస్)లో పొందుపర్చిన సమాచారం మేరకు ఈ జాబితాలను తయారు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండలపరిషత్ , మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల యాజమాన్యాల వారీగా సీనియారిటీ జాబితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ జాబితాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచారు. ఈ సాధారణ సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 24లోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. అభ్యంతరం తెలిపే టీచర్లు తమ పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలతో పాటు సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా తెపాలన్నారు. అభ్యంతరానికి ఆధారాలు, సంబంధిత సాక్ష్యాలను అభ్యంతర పత్రానికి జత చేసి సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరన్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ, ఆర్‌జేడీ కార్యాలయాల్లో సంప్రదించాలని డీఈవో కోరారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం



శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న వేదపండితులు

చినగంజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామంలోని భూ, నీళా సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో శ్రీరామకోటి 19వ వార్షిక శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆలయ అర్చకులు బృందావనం రాఘవ కుమారచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞీకులు పరాకుంశం రఘునాథాచార్యులు, బృందావనం భావనారాయణాచార్యులు, శ్రీనివాస దీక్షితులు, నారాయణం కల్యాణచక్రవర్తి విశ్వక్సేన ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, అష్టాక్షరి, గాయత్రి సీతారామ హనుమ మంత్ర హోమం, కిరీట సమర్పణ తదితర పూజలను నిర్వహించారు. తదనంతరం టీడీపీ వెంకటేశ్వరస్వామి కల్యాణ వ్యాఖ్యాత వాకాని రామకృష్ణశేషసాయి ఆధ్వర్యంలో వేదపండితులు సీతారామలక్ష్మణ, హనుత్‌స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ఆసోది శివకృష్ణారెడ్డి, పల్లవి, శ్రీనివాసరెడ్డి, వెంకటసాయిప్రసన్న దంపతులచే స్వామి వారికి వేదమంత్రోచ్చరణ నడువ శాస్త్రోక్తంగా పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలని వినియోగం చేశారు. ఈ నెల 10వ తేది నుండి ఆలయ ప్రాంగణంలో పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ పారాయణ సహిత హరేరామ నామ సవాహాము కార్యక్రమం ముగించింది. ఆసోది నాగేంద్రారెడ్డి, అంకమ్మ దంపతులు ఆలయ ప్రాంగణంలో రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ ఆసోది దశరథరామిరెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

గళం విప్పారు కానీ.. గట్టి'ధన'మేదీ?

(5వపేజీ తరువాయి)

చంద్రశేఖర్ ఉన్నారు. సాధారణంగా ప్రజల తరఫున గొంతెత్తేందుకు ప్రతిపక్షంలో ఇద్దరున్నా తొలిరోజు కొద్దిసేపు మినహా మిగతా సభా సమావేశాలకు గైర్హాజరయ్యారు. దీంతో వారు కూడా సభకు వెళ్లలేదు. అధికారపార్టీకి చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు సభకు హాజరుకావడంతోపాటు చురుకుగానే వ్యవహరించారు. జిల్లా ఉమ్మడి అంశాలపై వారు ప్రజల ఆకాంక్షలను సభలో ప్రతిబింబింపజేసే ప్రయత్నం చేయడంలో వెనుకబడ్డారు.

ఇతర సమస్యలపైనా అదే తీరు

● పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటు అవసరాన్ని కూడా సభలో చర్చ పెట్టలేకపోయారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ప్రతిపాదన తమ వద్ద లేవని కరాఖండిగా రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ సభలో చెప్పినా పార్టీపరంగా, ప్రభుత్వాధినేతగా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ విషయాన్ని చర్చకు పెట్టలేకపోయారు.

● ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ, చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి, అంశాలపై కూడా అదే పరిస్థితి.

● మరోవైపు పంటలకు చివరి దశలో సాగర్ నీరు రాక రైతులు పడుతున్న అగచాట్లు, పశ్చిమ ప్రాంతంలో వేసవికి ముందే గొంతు ఎండుతున్న తీరు, ధరలు లేక వివిధ పంటలు సాగు చేసిన రైతులు పడుతున్న అవస్థలను కూడా ఇటు సభలోనూ, అటు విడిగానూ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులను కలిసి పరిష్కారానికి చొరవ చూపడంలో వెనుకబడ్డారు.

రైతు ఆత్మహత్య

(5వపేజీ తరువాయి)

కెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు శ్రీను మృతితో కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

అన్నదమ్ములు మృతి

(5వపేజీ తరువాయి)

మృతితో నరసింహులు, కల్పన కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్ఐ శివ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎవరికి ఏ అసవరం వచ్చినా చెరువులో మట్టిని తవ్వుకుంటారు. దీంతో చెరువులో గుంతలు ఏర్పడి వాటిల్లో నీరు నిలుస్తోంది. ఆ గుంతల లోతు ఎవరికీ అర్థం కావడం లేదు. చిన్నారులు సైతం ఆ గుంతల లోతు అర్థంకాకనే దిగి మునిగి ఉంటారనే గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యం



మేదరమెట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి, మందులు వాడితే నివారణ సాధ్యమని ఎస్‌టీఎస్ రాజశేఖర్ అన్నారు. గురువారం మేదరమెట్ల జడ్పీ హైస్కూల్‌లో టీబీ లక్షణాలను ఆయన వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు కళ్లెలో రక్తపు చారలు, వాంతులు, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను కలవాలని సూచించారు. మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆర్‌టీపీసీఆర్ సెంటర్‌లో కళ్లె పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారని రాజశేఖర్ తెలపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ వెంకటరత్నం పాల్గొన్నారు.

అంగుళం సైజులో ఖురాన్ గ్రంథం



అతిచిన్న ఖురాన్ చూపుతున్న అబ్దుల్ రజాక్



అతిచిన్న ఖురాన్

ప్రతి పేజీ అంచుకు బంగారు పూత పూసి ఉండడం మరో ప్రత్యేకత

ముస్లింలకు అతి పవిత్రమైన గ్రంథం ఖురాన్.. కానీ ఆ గ్రంథం సూక్ష్మ పరిమాణంలో ఉండడం ఓ ప్రత్యేకత. అంగుళం సైజులో ఉండే ఖురాన్ గ్రంథంలోని ప్రతి పేజీ అంచులకు బంగారు పూత పూసి ఉండడం మరో స్పెషల్. మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డకు చెందిన స్టార్ ఆటోమొబైల్స్ అధినేత అబ్దుల్‌రజాక్ వద్ద చిన్న ఖురాన్ ప్రతి ఉంది. అతని తాత రైల్వే ఉద్యోగి అయిన మొహిద్దీన్ ఖాన్ అప్పట్లో ఈ ఖురాన్‌ను పఠించేవారు. ప్రయాణాలు చేసే సమయంలో వెంట తీసుకెళ్తూ బూతద్దం సహాయంతో ఈ ఖురాన్‌ను పఠించేవారని అబ్దుల్‌రజాక్ తెలిపారు. పాకెట్ సైజులో ఉన్న ఖురాన్‌ను తన తాత బహుమతిగా ఇవ్వడంతో అబ్దుల్ రజాక్ బహు జాగ్రత్తగా భద్రపరిచారు. ఎంతో విలువైన ఈ పుస్తకం పాదుషాల కాలం నాటిదని తెలుస్తోంది.

-మార్కాపురం వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)



చిన్న పెట్టెలో ఖురాన్

ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు



ఆగస్టు 22 నుంచి 24 వరకు నిర్వహణ

షెడ్యూల్ ఖరారు చేసిన రాష్ట్ర కమిటి

ఒంగోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తొలిసారిగా ఒంగోలు నగరం కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర స్థాయి సభలకు వేదిక కానుంది. సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలులో జరగనున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజులపాటు మహాసభలు నిర్వహించాలని ఆపార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి ప్రజాస్వామ్యబద్ధంగా స్థానిక శాఖ నుంచి దేశ స్థాయిలో జాతీయ మహాసభల వరకు కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తాయి. ఈ ఏడాది కూడా ప్రధాన కమ్యూనిస్టు పార్టీలైన సీపీఎం, సీపీఐలు ఆ ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే సీపీఎం జిల్లా, రాష్ట్ర మహాసభలు పూర్తయ్యి వచ్చే నెలలో తమిళనాడులో జాతీయ మహాసభలు నిర్వహించే క్రమంలో ఉండగా సీపీఐ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ప్రారంభమైంది. దేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మహాసభలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయించింది. ఆ మహాసభలు ఈ ఏడాది అక్టోబరులో పంజాబ్ రాజధాని చండీఘర్‌లో జరగనున్నాయి. ఆగస్టులోపు రాష్ట్రంలో శాఖల నుంచి జిల్లా, రాష్ట్ర మహాసభల పూర్తి చేయాలని, మూడు రోజుల క్రితం విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర మహాసభలను ఈ ఏడాది ఆగస్టు 22నుంచి 24వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మహాసభలకు ఆపార్టీ రాష్ట్ర నాయకత్వంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన, బహిరంగ సభలను కూడా నిర్వహించనున్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు. ఆమేరకు పార్టీ జిల్లా నాయకత్వానికి రాష్ట్ర కమిటి సమాచారం ఇచ్చింది.



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

టెన్త్ బార్ కోడింగ్ ప్రారంభం

జవాబు పత్రాల గోప్యత పాటించాలి

డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల బార్ కోడింగ్‌ను గురువారం ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో డీఈవో కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఆ స్కూలులోని పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రంలో మొదటిరోజు తెలుగు సబ్జెక్టు జవాబు పత్రాల బార్ కోడింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు ఆ జవాబు పత్రాలు ఏ విద్యార్థివో తెలియకుండా ఉంచడమే బార్‌కోడింగ్ ముఖ్య ఉద్దేశమన్నారు. బార్ కోడింగ్‌లో పూర్తి స్థాయిలో గోప్యత పాటించాలని ఆయన ఆదేశించారు. జవాబు పత్రాలకు ఉన్న ఓఎంఆర్ షీట్లలోని పార్ట్-1లో విద్యార్థుల వివరాలు ఉంటున్నందున పార్ట్-1ను ఓఎంఆర్ నుంచి వేరు చేసి భద్రపర్చాలని, ఒక సెంటర్‌కు కేటాయించిన కోడ్ నెంబర్‌ను మరో సెంటర్‌కు కేటాయిస్తే ఫలితాలు తారుమారు అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె. శివకుమార్, చీఫ్‌లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు ఉన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల పనివేళలు మార్పు

జిల్లాలో పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల పనివేళలు మళ్లీ మారాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో మిగిలిన పాఠశాలలను ఉదయం పూటే ఒంటిపూట బడులు నిర్వహిస్తున్న విషయం విదితమే. పదో తరగతి పరీక్షలు ఉన్నన్ని రోజులు పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని తాజాగా ఉత్తర్వులు వచ్చాయి. ఆ మేరకు ఎస్సీఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలను పరీక్షలు లేని రోజుల్లో కూడా ఉదయానికి బదులు మధ్యాహ్నం1.30నుంచి 5గంటల వరకు నిర్వహించనున్నారు.

ఎనిమిది ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు

ఈనెల 27న ఎన్నికలు

ఎన్నికల అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన ఎనిమిది గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. తదనుగుణంగా ఈ ఎన్నికల ను ఈనెల 27వ తేదీన నిర్వహించేందుకు జిల్లా పంచాయతీ అధికారి జీ వెంకటనాయుడు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 27న గ్రామ పంచాయతీలో సభ ఏర్పాటు చేసిన అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల అధికారులను ఆదేశించారు. కొండపి మండలం పెరదేపి, కంభం మండలం తురిమెళ్ల, కొనకనమిట్ల మండలం నాగంపల్లి, టంగుటూరు మండలం టంగుటూరు, టంగుటూరు మండలం ఆలకూరపాడు, బేస్తవారిపేట, మద్దిపాడు మండలం నాగన్నపాలెం, త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోనున్నారు.

ఎన్నికల అధికారుల నియామకం

ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు ఈవోఆర్డీలను ఎన్నికల అధికారులగా నియమించారు. ఆయా మండలాల అధికారులనే ఎన్నికల అధికారులుగా నియమించారు. ఈనెల 27న పంచాయతీలో సభ నిర్వహించిన అనంతరం ఉపసర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. పెరదేపికి ఎం. అంజనీదేవి, తురిమెళ్లకు బి.విజయలక్ష్మి, టంగుటూరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆలకూరపాడుకు ఈవోఆర్‌డీ కేవీ రామసుబ్బారావు, బేస్తవారిపేటకు ఎస్‌కే జిలానీబాషా, త్రిపురాంతకం మండలం మిట్టపాలెంకు పీఆర్ ఏఈ ఆర్.వెంకట సుబ్బయ్యలను నియమిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీచేశారు.



ఎంపీపీలు, వైస్ ఎంపీపీల ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం

జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఎంపీపీలు, ఒక ఉపాధ్యక్ష, ఒక కోఆప్షన్ సభ్యుడు ఎన్నికకు ఎన్నికల అధికారులను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 27న పరోక్ష పద్ధతిలో మార్కాపురం, త్రిపురాంతకం మండల అధ్యక్షుని పదవులకు, పుల్లలచెరువు మండల ఉపాధ్యక్ష పదవికి, యర్రగొండపాలెం మండల కోఆప్షన్ పదవికి ఎన్నిక జరగనుంది. ఆ రోజున ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈఎన్నిక నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులను ఎన్నికల అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కాపురానికి డీఎల్‌డీవో కే శ్రీనివాసరెడ్డి, త్రిపురాంతకానికి డ్వామా వాటర్‌షెడ్ ఏపీడీ టీజే వండర్‌మెన్, పుల్లలచెరువుకు వ్యవసాయ మార్కెట్ కమిటి అధికారి కేవీఎస్ ఉపేంద్రకుమార్, యర్రగొండపాలేనికి మార్కాపురం మైన్స్‌అండ్ గెలాక్సీ ఏడీ ఎ.విష్ణువర్ధన్‌లను ఎన్నికల అధికారులుగా నియమిస్తూ చిరంజీవి ఉత్తర్వులు జారీచేశారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

● మన్నూరు తీరంలో మృతదేహం లభ్యం



సిసింద్రీ (ఫైల్)

సింగరాయకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల తీరంలో ప్రమాదవశాత్తూ గల్లంతైన టంగుటూరు మండలం ఎం.నిడమనూరు గ్రామానికి చెందిన చాట్రగడ్డ సిసింద్రీ(27) మృతి చెందాడు. అతని మృతదేహం మన్నూరు సముద్రతీరంలో గురువారం లభ్యమైంది. సమాచారం అందుకున్న సింగరాయకొండ పోలీస్ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

చేపల కోసం వెళ్లి యువకుడి మృతి



శవాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనుక్

పొన్నలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన నూకతోటి చిరంజీవి (24) బుధవారం ఉదయం గ్రామానికి సమీపంలోని పాలేరులో చేపల కోసం వెళ్లి ప్రమాదవశాత్తూ వాగులో పడి బుధవారం ఉదయం మరణించాడు. పుట్టుకతో మూగ, చెవిటి అయిన చిరంజీవి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో చిరంజీవి అన్న అంకమ్మరావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలించి చిరంజీవి మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. అంకమరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై అనుక్ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సోలార్ ప్లేట్ల చోరీ ముఠా అరెస్ట్

● నీళ్ల ఇంజన్, రూ.85వేల సొత్తు స్వాధీనం

● వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య, పక్కన టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరావు

సింగరాయకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు, సంతనూతలపాడు మండలాల్లోని పొలాల్లో రైతులు ఏర్పాటుచేసుకొన్న సోలార్ ప్లేట్లు, ఇంజన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను టంగుటూరు ఎస్సై నాగేమల్లేశ్వరావు సిబ్బందితో చాకచక్యంగా అరెస్ట్ చేశారు. సోలార్ ప్లేట్లు, ఇంజన్లు అమ్మగా వచ్చిన రూ.85 వేల నగదును, ఒక నీళ్ల ఇంజన్‌ను దొంగల నుంచి స్వాధీనం చేసుకొన్నారు. గురువారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరావుతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. టంగుటూరు మండలం మల్లవరపాడు గ్రామానికి చెందిన గౌతుకట్ల అశోక్, పొన్నూరి రాంబాబు, పాటిబండ్ల శ్రీకాంత్ చెడువ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడటం ప్రారంభించారు. తొలుత గత ఏడాది ఫిబ్రవరిలో కందులూరు గ్రామం నుంచి ఎర్రజర్ల వెళ్లేదారిలోని పంటపొలాల్లో 20 సోలార్ ప్లేట్లును దొంగిలించారు. ఈ నెల మొదటి వారంలో మల్లవరపాడులోని పెద్దచెరువు దక్షిణం వైపు కట్టమీద ఉన్న నీళ్ల ఇంజన్‌ను అపహరించారు. పది రోజుల క్రితం సంతనూతలపాడు గ్రామంలోని పంట పొలాల్లో 15 సోలార్ ప్లేట్లును దొంగిలించారు. ఈ క్రమంలో మల్లవరపాడుకి చెందిన రైతు నాగినేని రంగారావు, పైడి శ్రీనివాసులు తమ ఇంజన్, సోలార్ ప్లేట్స్ అపహరణకు గురయ్యాయని టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశాలతో సీఐ హజరత్తయ్య ఆధర్యంలో ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేశారు. ఈక్రమంలో గురువారం టంగుటూరు కొండపి ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా సోలార్ ప్లేట్లు, ఇంజన్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నిదితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్ తరలించారు. కేసు చేధనలో ప్రతిభ కనబరిచిన ఎస్సై నాగమల్లేశ్వరావు, సిబ్బంది శ్రీనివాస్, మహేష్, వెంకట్రావు, ఖాదర్‌వలిని సీఐ హజరత్తయ్య అభినందించారు.

ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయాలి

కొండపి, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సంఘాల, స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరం రికార్డులను వీవోఏలు త్వరలో జరిగే ఆడిట్‌కు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ- వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్ సూచించారు. గురువారం కొండపిలోని డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సంస్థాగత పనులు, ఆర్థికపరమైన క్రమశిక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలిగించారు. సమావేశంలో వీవోఏలు శేషమ్మ, ఎం.గంగాధర, వి.అన్నపూర్ణమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

చీఫ్‌ల సెల్‌ఫోన్లకు పాక్షిక అనుమతి

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద నేటి నుంచి అమలు

ఒంగోలు విద్య, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్లు తెచ్చుకునేందుకు పాక్షిక అనుమతి లభించింది. చీఫ్‌లు తమ సెల్ ఫోన్లు తెచ్చినా పరీక్ష ప్రారంభానికి ముందే స్విచ్ఛాఫ్ చేసి పరీక్షా కేంద్రం వద్ద నియమితులైన పోలీస్ సిబ్బంది వద్ద భద్రపర్చుకోవాలి. మొదట ప్రకటించిన ప్రకారం పరీక్షా కేంద్రాలు నో ఫోన్‌జోన్ ప్రాంతాలు. చీఫ్‌లు, డీవోలు, ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బంది ఎవ్వరు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకరాకూడదు. ఈ విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు తలో మాట చెప్పడంతో 'సెల్‌ఫోన్‌పై తలోమాట' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. చీఫ్‌లు దగ్గర సెల్‌ఫోన్లు లేకపోవడంతో ఏదైనా అత్యవసరం పడితే పెద్ద సమస్య అయ్యే ప్రమాదం ఉంది. పరీక్షకు విద్యార్థుల హాజరు వివరాలు అందించేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ వివరాలను జిల్లా కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ ఆంక్షలను పాక్షికంగా సడలించి చీఫ్‌లకు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతిస్తారు. పరీక్షలు జరిగే సమయంలో మాత్రం సెల్‌ను పోలీసుల కస్టడీలో ఉండాలి. పరీక్ష ముగిశాక ఫోన్ వాడేందుకు అనుమతించారు.

హెచ్‌ఎంపై కేసు నమోదు

కనిగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విద్యార్థినిపై ఉపాధ్యాయుడు రంగారెడ్డి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. లైంగిక వేధింపుల విషయాన్ని హెచ్‌ఎం పోలీసులకు సమాచారం కాని, ఫిర్యాదు కాని చేయకపోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. కేసులో నిందితుడిగా చేర్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ శ్రీరాం పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై కేసును ఉపసంహరించుకోవాలి

ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో హెచ్‌ఎం విజయలక్ష్మీపై పోలీసులు కేసు నమోదు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు హెచ్‌ఎం దృష్టికి రాగానే డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో దృష్టికి తీసుకెళ్లి ఆయనపై చర్యలు తీసుకోవటానికి తన వంతు కృషి చేసినట్లు చెప్పారు. బాలికల తల్లుల పేరుతో కొందరు స్కూల్లోకి ప్రవేశించి హెచ్‌ఎం, మహిళా సిబ్బందిపై భౌతిక దాడిచేసి కొట్టారన్నారు. హెచ్‌ఎం మెడలోని బంగారు నల్లపూలస దండ లాక్కుని వెళ్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించటం గర్హనీయమన్నారు. టి.రమణారెడ్డి, ఖాజారహంతుల్లా, రాము, మల్లికార్జున, నరసింహం పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

ఒంగోలు క్రైం, మార్చి20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని విద్యుత్‌భవన్ ఎదుట విద్యుత్ మీటర్ రీడర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గత 15 ఏళ్లుగా మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అందువల్ల అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రత్నరాజు, నాయకులు సిద్ధయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ విద్యార్థుల ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి


విద్యార్థులకు బహుమతి, ప్రశంసాపత్రాలను అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందిస్తున్న ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. కళాశాల ఈసీఈ విద్యార్థులు రూపొందించిన సర్వేలెన్స్ స్పైకెమెరా కారు ప్రాజెక్టును జేఎన్‌టీయూకేలో నిర్వహించిన జాతీయస్థాయి ఫెస్ట్‌లో ప్రదర్శించగా ప్రథమ బహుమతి లభించింది. ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థులు నల్లమల్లి జానకిరామిరెడ్డి, బీఎస్.బసవరాజు, బి.కోటేశ్వరరావు, వైఆర్ఎల్పీ.రాకేష్‌లు ఈ ప్రాజెక్టును తయారు చేశారు. దీనిని మిలటరీ ఆపరేషన్లు, అండర్ కవర్ ఆపరేషన్లు, మైనింగ్ లాంటి వాటిల్లో ఉపయోగిస్తారని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ గాయత్రీ గురువారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఈసీఈ విభాగాధిపతి హిమబిందు, ప్రాజెక్టు మెండర్లు ఉమామహేశ్వర్, శ్రీకాంత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(రూరల్), మార్చి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి సంబంధించిన పథకాల అమలుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం పార్లమెంట్ సమావేశాలలో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమశాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ మాట్లాడుతూ మత్స్య సంపద యోజన ద్వారా గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో 3,17,558 మంది, అందులో ప్రకాశం జిల్లాలో 13,203 మంది లబ్ధి పొందారని చెప్పారు. 525మంది మత్స్యకారులు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. జిల్లాకు 30,345 యూనిట్‌లు మంజూరు కాగా 19,441 యూనిట్‌లు లబ్ధిదారులకు అందించామని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

సత్తా చాటిన పేస్ కళాశాల విద్యార్థి



రాజేంద్రకు బహుమతిని అందిస్తున్న అతిథులు

ఒంగోలు విద్య, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థి డి.రాజేంద్ర రూపొందించిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. జేఎన్‌టీయూకేలో జరిగిన యూనివర్శిటీ ప్రాజెక్టు ఎక్స్‌పో విభాగంలో ప్రథమబహుమతికి ఎంపికైంది. రాష్ట్రానికి చెందిన వివిధ కళాశాలల విద్యార్థులు ఈ ఎక్స్‌పోలో తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. పేస్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్వస్తి ఇండియా టాటాకు ప్రథమ బహుమతి లభించగా ముఖ్యఅతిథులు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, రూప అక్కేష్ తదితరులు అభినందించారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.280

మద్దిపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికింది. చంద్రపాడు క్లస్టర్ రైతులు 27 బేళ్ల అమ్మకానికి తీసుకువచ్చారు. కనిష్ఠ ధర రూ.270 పలికిందని వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ధర రావాలంటే గ్రేడింగ్ విధానంలో మెలకువలు పాటించాలన్నారు. రైతులు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రెండవ రోజైన గురువారం కేజీకి అత్యధిక ధర రూ.280 రైతులకు దక్కింది. టంగుటూరు వేలం కేంద్రానికి రెండవరోజున చింతలపాలెం, దావగూడూరు రైతుల పొగాకు 27 బేళ్లు తీసుకొచ్చారు. అన్నీ ఒకే ధరకు కొనుగోలు చేశారు. వేలంలో మొత్తం 8 కంపెనీలు పాల్గొన్నాయి.

ఒంగోలు(రూరల్): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో గురువారం జరిగిన వేలంలో 27 బేళ్లు అమ్మకాలు జరిగాయి. సర్వేరెడ్డిపాలెం, వెంగముక్కపాలెం గ్రామాల రైతులకు చెందిన బేళ్లను వేలంలో ఉంచగా గరిష్ఠ ధర కిలో రూ.280 కాగా కనిష్ఠ ధర రూ.277 పలికింది. వేలాన్ని నిర్వహణాధికారి జె.తులసి పర్యవేక్షించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో మాదిగలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చాట్ల దానియేలు, కంచర్ల సుధాకర్, వంగలపూడి నాగేశ్వరరావు, కె.నాగభూషణం, బి.సుధాకర్, రాజు, పూలరాజు, రాధమ్మ పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో చోరీ


నాగార్పమ్మ ఆలయం

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పూరిమెట్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీనాగార్పమ్మ అమ్మవారి ఆలయంలో దుండగులు గురువారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలు పగులగొట్టి హుండీ చోరీకి పాల్పడ్డారు. హుండీ రూ.పది వేలకు పైగా నగదు ఉంటుందని ఆలయ పూజారి తెలిపారు. ఆలయంలో భక్తులు పూజ చేయటానికి ఉదయం వెళ్లగా తలుపులు పగులగొట్టి ఉండటంతో ఆందోళన చెందారు. ఇటీవల మండలంలో ఆలయాల్లో చోరీలు ఎక్కువయ్యాయి.

రోడ్డు మార్జిన్‌లకు నల్లరేగడి మట్టి

● వాహనదారుల ఆందోళన

ఒంగోలు(రూరల్), మార్చి20(ఆంధ్రజ్యోతి): త్రోవగుంట వద్దగల జాతీయ రహదారి నుంచి ఒంగోలు మండలం మండువవారిపాలెం- మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామాల మధ్య గల ఆర్‌అండ్‌బీ తారురోడ్డు మార్జిన్‌కు నల్లరేగడి మట్టి తోలడంతో పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సింగిల్ రోడ్డుకు మార్జిన్‌లు పూర్తిగా దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో సంబంధిత గుత్తేదారు రోడ్డులో ఏర్పడిన గుంతలకు ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. అదేక్రమంలో మార్జిన్‌లో ఏర్పడిన గుంతలు పూడ్చటానికి రోడ్డు పక్కనే ఉన్న నల్ల రేగడి మట్టి తోలుతున్నారు. అయితే వర్షాలు పడిన సమయంలో రోడ్డు మార్జిన్‌లోకి వాహనం వెళితే జారి సైడుకాలువలోకి పడే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మార్జిన్‌లో గ్రావెల్ వేసి గుంతలు పూడ్చాలని మండవవారిపాలెం, లింగంకుంట గ్రామస్థులు కోరుతున్నారు.


రోడ్డు మార్జిన్‌లో తోలిని మట్టి

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలి

సీపీఎం నాయకుల డిమాండ్


కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొన్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించడంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా కమిటీ సభ్యులు జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు, ప్రజాచైతన్య యాత్రల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గ్రానైట్, ఆక్వా, పొగాకు వంటి వనరుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.20వేల కోట్లు జమ అవుతున్నాయన్నారు. జిల్లా ప్రజానీకానికి చెందిన ఈ సంపదలో జిల్లావాటాగా రూ.10వేల కోట్లు ఒకే విడత ప్యాకేజీగా అందిస్తే వెలిగొండ, సంగమేశ్వరం, పాలేటిపాడు, గుండ్లకమ్మ వంటి సాగునీటి ప్రాజెక్టు పూర్తయ్యి వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. మరో వైపు పారిశ్రామికంగా అభివృద్ధి పొంది జిల్లా అన్నింటా ప్రగతిని సాధిస్తుందని తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రయోజనాలకు కృషి చేస్తున్నారే తప్ప జిల్లా అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత సీఎం జగన్మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించి ప్రజలను మభ్యపెట్టారన్నారు. జిల్లాలో గుండ్లకమ్మ, పాలేరు, మన్నేరు, మూసి వంటి నదుల ద్వారా ఏటా 150 టీఎంసీల నీరు వర్షాకాలంలో సముద్రంలో కలిసి వృథాగా పోతున్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దొనకొండ పారిశ్రామికకారిడార్, కనిగిరి నిమ్జ్ కోసం వేలాది ఎకరాలు సేకరించిన ప్రభుత్వభూములు బీళ్ళుగా మారాయో తప్ప ఒక్క పరిశ్రమ స్థాపించకపోవడం బాధకరమన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీకి నిధులు కేటాయింపుతో పాటు మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నిలిపివేయడం దారుణంగా ఉందని చెప్పారు. అలాగే నాయకులు పెంట్యాల హనుమంతరావు, పి.వెంకటరావు, కేజీ.మస్తాన్, కంకణాల రమాదేవి, పెంట్యాల కల్పనలు మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీని పూర్తి చేయడంతో పాటు నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయంతి బాబు, కాలం సుబ్బారావు, బి.బాలకోటయ్య, బంకా సుబ్బారావు, వెల్లంపల్లి ఆంజనేయులు, రాము, ఉబ్బా ఆదిలక్ష్మి, పల్లామల్లి ఆంజనేయులు, కిలారి పెద్దాబ్బాయి, శ్రీకాంత్, స్వామిరెడ్డి, నెరుసుల వెంకటేశ్వర్లు, ఎస్‌డీ.హుస్సేన్, కేఎఫ్.బాబు, ఎస్‌కే.సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

● ఎమ్మెల్యే దామచర్ల

● టీడీపీ కార్యాలయంలో ఇఫ్తార్ విందు


ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, హాజరైన ముస్లింలు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లింలకు గురువారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే టీడీపీ హయాంలో నగరంలో రూ.1.5 కోట్లతో షాదీఖానా నిర్మాణం, ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి, యువత కోసం రూ.7.5 కోట్లు రుణాలు, రంజాన్ తోఫా, కుట్టు మిషన్‌లు ఇచ్చి స్వయంకృషితో ఆర్థికపురోభివృద్ధి సాధించేలా కృషి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ మాసంలో భక్తి శ్రద్ధలతో దీక్షతో ఉపవాసాలతో అల్లాను ప్రార్థించడం ఆదర్శనీయం అన్నారు. అందరూ పండగను ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

● డీపీవో వెంకటనాయుడు



ఇనమనమెళ్లూరులో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

మద్దిపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పన్నులు వసూలు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీపీవో వెంకటనాయుడు హెచ్చరించారు. గురువారం ఇనమనమెళ్లూరు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు లోపు పన్నులు పూర్తిగా వసూలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ బకాయి ఉన్న రూ.2,78,435 పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వాడుకలోకి తీసుకొని రావాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే మండల అభివృది పై ఈవోఆర్డీ రఘుబాబుతో సమీక్ష చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు సూచించారు. మండలంలోని ఈదుమూడి, ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తొలుత ఈదుమూడిలోని చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. దీని ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం

● భారీగా హాజరైన భక్తులు


కల్యాణం నిర్వహిస్తున్న రుత్విక్కులు

ఒంగోలు కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో గురువారం రాత్రి నిర్వహించిన శ్రీ పద్మావతీ సమేత శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిలభారత వాసవి పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి నగరానికి విచ్చేసిన సందర్భంగా కల్యాణోత్సవం ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామీజీ ఈ నెల 15న తెనాలిలో బయల్దేరి పాదయాత్రగా ఈ నెల 24న తిరుమలకు చేరుకోనున్నారు. మార్గమధ్యంలో ఒంగోలులో బస చేశారు. ఈ సందర్భంగా రుత్విక్కులు విష్వక్సేన పూజ, మండపారాధన, మాంగల్య పూజ, మాంగల్య ధారణ, స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ మొదలైన కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ ఇతర కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వేసవిలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో వచ్చే వ్యాధులపై వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ, రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం రాజధాని అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన లక్ష్యాలను నూరుశాతం సాధించాలని, 18 ఏళ్ళు నిండిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏఎన్ఎంలు, సీహెచ్‌వోల ద్వారా గృహ సందర్శనాలతో పాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆరోగ్య భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, ఇమ్యూనైజేషన్ అధికారి పద్మజ, డీపీఎంవో సౌజన్య, అధికారులు వాణిశ్రీ, శ్రావణ్, హేమంత్, డేటా జిల్లామేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మికశాఖ జిల్లా ఉప కమిషనర్ గాయత్రిదేవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. కార్మికశాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సూచించారు. కర్మాగారాలు, దుకాణాలలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు జాగ్రత్తలు పాటించాలన్నారు. యాజమాన్యాలు కార్మికుల పని ప్రదేశాలలో చల్లనినీరు, నీడ, వసతి కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, వైద్యసహాయం అందేలా చూసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12నుంచి 4 గంటల వరకు పనిలో విశ్రాంతి తీసుకోవాలని, డీ హైడిరేషన్ నివారణ మార్గాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'చిట్టిపాటి'


వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఒంగోలుకు చెందిన చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులో జరిగిన అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర విలీన సభలో 33 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా ప్రకాశం జిల్లా నుంచి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తిరిగి రెండో సారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు, మిర్చి, శనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేయడంతో పాటు అసైన్‌మెంట్ యాక్టును సవరణ చేసి అర్హులైన దళిత, గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు.

రాజ్యాధికారం ద్వారానే సమానత్వం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజనులకు రాజ్యాధికారం ద్వారానే సాంఘిక సమానత్వం సిద్ధిస్తుందని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్ వద్ద గురువారం రాజ్యాధికారప్రచార కార్యక్రమం నిర్వహించారు. దేశంలో మతోన్మాద శక్తులను నిలువరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కట్ట వరప్రసాద్, కార్యదర్శి దాసరి సంగీతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, జార్జి, సుబ్బారావు, దాసరి అంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

పొన్నలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగనంపాడు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన సిబ్బందితో దాడి చేసి 8 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9,430 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అనుక్ తెలిపారు.

23న మాలల మహాగర్జన సభ

టంగుటూరు మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ గ్రౌండ్‌లో ఈనెల 23న జరుగనున్న మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు గురువారం మాలలకు పిలుపునిచ్చారు. టంగుటూరులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రేపు ఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సమావేశం

నాగులుప్పలపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు ఎంఆర్‌పీఎస్ ఉద్యమ పురిటిగడ్డ ఈదుమూడి గ్రామంలో ఈ నెల 22న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు కొమ్మూరి గరటయ్య, మల్లెల ప్రసాద్‌మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పెనుకొండ క్షేత్ర పీఠాధిపతికి స్వాగతం


ప్రజ్ఞానంద సర్వస్వతి బాలస్వామికి స్వాగతం పలికిన ఆర్యవైశ్యులు

నాగులుప్పలపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి సమీపంలోని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సర్వస్వతి బాలస్వామి తిరుమలకు చేపట్టిన మహా పాదయాత్ర గురువారం మండల కేంద్రం నాగులుప్పలపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వామిజీకి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట కొంతదూరం సంఘీభావంగా పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కొంజేటి వెంకటసురేష్ బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అగ్రివర్సిటీలో వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉపాధి పనుల సోషల్ ఆడిట్‌పై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో రాఘవేంద్ర

చీమకుర్తి, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024మార్చి 31వరకు నిర్వహించిన ఉపాధి పనులు, సచివాలయ సముదాయాలకు చెందిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం చీమకుర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాఘవేంద్ర మాట్లాడుతూ ఆడిట్ నిర్వహించే సిబ్బంది అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పక్కాగా ఆడిట్ జరపాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి వరలక్ష్మి

సంతనూతలపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు వరలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆమె పరిశీలించారు. గ్రంథాలయం సెస్ వివరాలను తెలుసుకున్నారు. గ్రంథాలయ పాలకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని శ్రీసువచ్చలా సమేతా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. ప్రతి ఏడాది ఫాల్గుణ మాస బహుళ సప్తమి రోజున తిరునాళ్ల జరపటం ఆనవాయితీ. భక్తులు ఒకరోజు ముందుగానే ఆలయానికి వచ్చి పూజలు చేశారు. టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు.

అవీ..ఇవీ



కందులాపురంలో అసంపూర్తిగా నిలిచిన గృహాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అసంపూర్తి గృహ నిర్మాణాల పరిశీలన

కంభం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలో మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలను తహసీల్దార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కందులాపురం పంచాయతీ పరిధిలో 264 మందికి పక్కాగృహాలు మంజూరు చేసింది. వాటిలో అనర్హులకు కూడా మంజూరు చేసినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ కిరణ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈకాలనీలో సుమారు 100 మంది ఇప్పటివరకు గృహాల నిర్మాణం ప్రారంభించలేదని తెలుసుకున్నారు. మిగిలిన 164 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఎందుకు నిలిపివేశారు, అర్హులు, అనర్హులు ఎంత మంది అని విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.



వై.పాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ

ఉపాధి పనులపై గ్రామ సభ

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2023-24 ఏడాదికి సంబంధించి ఎర్రగొండపాలెంలో జరిగిన జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం పనులపై గురువారం స్థానిక సచివాలయం 3 సమీపంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ జయ శంకర్‌చారి జరిగిన పనులను గ్రామ సభలో వెల్లడించారు. 315 వర్క్ ఐడీలలో రూ. 4.97కోట్లు పనులు జరిగినట్లు తెలిపారు. ఆడిట్‌లో చేసిన పనులలో కొలతల్లో తేడా ఉన్నట్లు తెలిపారు. అలాగే మృతి చెందిన వారికి మస్టర్ పేమెంట్ చేశారని అలాగే ఇతర ప్రాంతాలలో ఉన్నవారికి, ఉద్యోగులకు పెమెంట్ చేసినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలపాలని గ్రామ సభలో సూచించారు. ఏవరూ అభ్యంతరాలు తేలియజేకపోవడంతో గ్రామ సభను ముగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఎస్‌ఆర్‌పీ ప్రవీణ్ కుమార్, ఈసీ లక్ష్మనాయక్, టీఏలు శ్రీనివాస రెడ్డి, లక్ష్మ నాయక్, రమణ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ప్రజా వేదిక వాయిదా

ఉపాధి పనులపై ఈ నెల 21న జరగాల్సిన ప్రజావేదిక అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు ఏపీవో శైలజ గురువారం తెలిపారు.ఎప్పుడు జరిగేది తర్వాత తెలియజేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కమిషనర్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు వేయాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దోమలు విపరీతంగా ఉన్న దృష్ట్యా వారానికి ఒక పర్యాయం ఫాగింగ్ చేయాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమలు ఉత్పత్తికాకుండా మందులు పిచికారీ చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు దప్పిలి వినోద్‌రెడ్డి, రాచర్ల కాసులు, రామకృష్ణ, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణతోనే ప్రాణాలకు రక్షణ

మార్కాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడంతోనే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు అన్నారు. స్థానిక ఎస్టేట్ సమీపంలో బుధవారం జాతీయ రహదారి-565పై పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ వాహనాల పత్రాలు లేనివారిపై కేసులు రాశారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మార్కాపురం,గిద్దలూరు శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబులు గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలుఅంశాలపై జగన్‌తో చర్చించారు.

అనారోగ్యంతో ఫారెస్టు బీట్ ఆఫీసర్ మృతి

గిద్దలూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఫారెస్టు బీట్ ఆఫీసర్ కిశోర్ (40) అనారోగ్యంతో మృతిచెందాడు. కనిగిరిలో బీట్ ఆఫీసర్‌గా పని చేస్తూ ఉన్న కిశోర్ ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. పట్టణంలోని చాకలి వీధిలో నివాసం ఉంటున్న కిశోర్‌కు భార్య, కూతురు ఉన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

తర్లుపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 నుంచి 50 సంవత్సరాల లోపు మహిళలు కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ తెలిపారు. 3 నెలల పాటు శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు కుట్టుమిషన్‌ను కూడా ప్రభుత్వం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన మహిళలు 22తేదీలోపు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సుద్దకురవ తండాకి చెందిన నాగు నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక రవీంద్ర ఆసుపత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షించి రక్తం ఎక్కించాలని సూచించారు. దీనితో బంధువుల సమాచారం మేరకు ఆసరా ట్రస్టు నాయకులు అయిన శ్రీనివాస్ నాయక్ స్పందించి రోగికి అవసరమైన రక్తాన్ని గురువారం అందజేశారు. రోగి కుంటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంకమ్మగూడెంలో వైద్యశిబిరం

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకమ్మ గూడెంలో డాక్టర్ కోటానాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గూడెంలోని 30 కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆనంతరం మందులు పంపిణీ చేశారు.

గాడితప్పిన రెవెన్యూ పాలన

అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన తహసీల్దారు

వారానికోసారి వస్తున్న ఇన్‌చార్జి

అందుబాటులో ఉండని సిబ్బంది

పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల అధికారుల తీరుతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ పని కావాలన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంది. అయితే అవినీతి ఆరోపణలతో తహసీల్దార్ సస్పెండ్ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ను నియమించగా ఆయన వారానికోసారి వస్తున్నారు. ఇక సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది.దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చేవారికి రెవెన్యూ అధికారులే అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పలు కులాలకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై లోన్లు మంజూరు చేసింది. దీనితో పలు కులాలకు చెందిన ప్రజలు కుల ధ్రువీకరణ కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తున్నారు. కొంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నా మరి కొంత మంది అందుబాటులో లేకపోగా వారు ఎక్కడ ఉంటే అక్కడికి రావాలని చెప్పడం విశేషం. సిబ్బంది సంతకాలు చేసినా తహసీల్దారు అందుబాటులో లేక పోవడంతో డిజిటల్ సంతకం కోసం ఆలస్యం అవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జి తహసీల్దారును కాకుండా రెగ్యులర్ తహసీల్దారును నియమించి కార్యాలయాన్ని గాడిలో పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వై.పాలెం తహసీల్దారు కార్యాలయం

గత తహసీల్దారు పనులపై విచారణ

అవినీతి అరోపణలతో సస్పెండ్ అయిన అప్పటి తహసీల్దారు కె బాల కిషోర్ విధులలో చేరినప్పటి నుంచి చేసిన పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు అదేశాల జారీ చేసినట్లు సమాచారం. అంతే కాకుండా పలువురు వీఆర్వోలు, సర్వేయర్లు చేసిన పనులపై కూడా విచారణ చేపట్టాలని అదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'చిక్కడు దొరకడు' కథనంపై కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

గతంలోనూ ఇదే తంతు..

గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇదే తంతు నడిచింది. అప్పట్లో కూడా తహసీల్దారు సస్పెండ్ అయిన సందర్భాలు ఉన్నాయి. పట్టు మని ఏడాదైన పూర్తి స్థాయిలో రెగ్యులర్ తహసీల్దార్లు పనిచేసిన దాఖలాలు ఎర్రగొండపాలెంలో లేవని మండల ప్రజలు అంటున్నారు. కలెక్టర్ ఎర్రగొండపాలెంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు పనులు చేసే రెగ్యులర్ తహసీల్దారును నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండ పూర్తి చేయాలని సీపీఎం ఆందోళన

● **కోర్టు సెంటర్‌లో రాస్తారోకో**

మార్కాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశానికి ఆశాదీపంలాంటి వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం వెలిగొండ ప్రాజెక్టు, మెడికల్ కాలేజీలను త్వరగా పూర్తి చేయాలని, మార్కాపురంను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాబు మాట్లాడుతూ తాజాగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.359 కోట్లు కేటాయించిందన్నారు. కొద్దిపాటి నిధులతో ప్రాజెక్టును ఎన్నటికి పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే తగినన్ని నిధులు కేటాయించి వెంటనే ప్రాజెక్టును పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తికావాలంటే రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరాయంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అదే విధంగా మార్కాపురం జిల్లా కూడా ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. తాజాగా మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి కీలకమైన ఈ రెండు విషయాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించిన మెడికల్ కాలేజీని కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం స్థానిక కోర్టు సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య, పట్టణ, మండల కార్యదర్శులు డీకేఎం రఫీ, గుమ్మా బాలనాగయ్య, టి.ఆవులయ్య, తిరుపతిరావు, ఎస్‌కె అన్వర్, పి.రూబెన్, ఏనుగుల సురేష్, జవ్వాజి రాజు, కె.కాశయ్య, జె.నాగరాజు, జి.మల్లయ్య, సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, దావీదు తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అక్రమ ఆన్‌లైన్‌ను తొలగించాలి

● **తోకపల్లి గ్రామస్థుల ధర్నా**

పెద్దారవీడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తమ భూములను వేరొకరి పేరుమీద అక్రమంగా ఆన్‌లైన్ చేశారని, వాటిని తొలగించి తమ భూములు తమకు చెందే విధంగా చేయాలని మండలంలోని తోకపల్లి గ్రామస్థులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోకపల్లి మాజీసర్పంచ్ భర్త మేకల శంకర్ పేరున పేదలకు చెందిన భూములు అక్రమంగా ఆన్‌లైన్ చేసిన అధికారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. తోకపల్లికి చెందిన సర్వే నెంబర్ 102-1సీలో 3.58 ఎకరాలు, స.నెం.14-2లో 0.25 ఎకరాలు, స.నెం.164-1ఏలో 0.36 ఎకరాలు, స.నెం.373లో 2 ఎకరాలు, స.నెం.376-2ఏలో 1 ఎకరా, 376-1లో 2.45 ఎకరాలు, 376-2బీ లో 5 ఎకరాలు, ఇలా సుమారు 20 ఎకరాలకు పైగా అక్రమంగా ఆన్‌లైన్ చేశారని వారు తెలిపారు. ఈ మేరకు ఎంఆర్‌ఐ గోపికి వినతిపత్రం అందజేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో తోకపల్లి గ్రామస్థులు చేతుల రమణమ్మ, చింతం మరియమ్మ, ఉప్పలపాటి చిన్న పొట్టయ్య, చింతా ఎస్తేరమ్మ, కొత్తా నాగయ్య, చేతుల చలమయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తోకపల్లి గ్రామస్థులు

సనాతన ధర్మం పుస్తకావిష్కరణ

గిద్దలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన పి.శివమల్లారెడ్డి రచించిన సనాతన ధర్మం పుస్తకాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు ఆవిష్కరించారు. హైందవ భావాలను, సనాతన ధర్మం గురించి ప్రజలకు ఉపయోగపడే విశిష్టమైన అంశాలు పొందుపరిచిన రచయిత మల్లారెడ్డిని సాయిబాబు అభినందించారు. ఈకార్యక్రమంలో రాచర్ల మండల జనసేన పార్టీ నాయకులు నాయుడు, చిన్న, శివ, యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

గిద్దలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన విద్యార్థులు విజయవాడలో జరిగిన అమరావతి కప్ 2025 కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనపరచి మెడల్స్ సాధించారు. కటాస్ విభాగంలో భార్గవితేజ, నోకియా సిల్వర్ మెడల్స్ సాధించగా 12 ఏళ్ల విభాగంలో సన, సంకీర్తన, దీపాలి, వరున్, గౌతమ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. 19 ఏళ్ల ఫైటింగ్ విభాగంలో పసుపులేటి హేమలత గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి

పుల్లలచెరువు,మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి దేశభక్తి కలిగి ఉండాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు.గురువారం పుల్లలచెరువు జడ్పీ పాఠశాలలో ఆర్మీ యూనిఫాంను విద్యార్థులకు అందజేసి ఆర్మీ,సైనికుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొలుకులూరి కృష్ణయ్య,ఎల్‌టి శివనాగిరెడ్డి,వెంకటరెడ్డి, స్కౌట్ మాస్టర్ వెంకటకోటయ్య, ఉపాధ్యాయుడు జానీ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ సేవలు మరువరానివి

● **ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**

గిద్దలూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఎంపీపీగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన దప్పిలి లక్ష్మమ్మ సేవలు అమోఘమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దప్పిలి లక్ష్మమ్మ పెద్దకర్మ గురువారం కుటుంబసభ్యులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దప్పిలి లక్ష్మమ్మ ఎంపీపీగా విశేష సేవలు అందించారని, అంతకుముందు భర్త దప్పిలి పాండురంగారెడ్డి గిద్దలూరు ఎమ్మెల్యేగా, ఎంఎల్‌సీగా పని చేసినపుడు భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ సహకరించారని కొనియాడారు. అనంతరం ఆమె కుమారులైన దప్పిలి చంద్రశేఖర్‌రెడ్డి, దప్పిలి భాస్కర్‌రెడ్డిలు గిద్దలూరు మేజర్ పంచాయతీకి సర్పంచ్‌లుగా సేవలు చేశారని, దప్పిలి రాజకీయ కుటుంబంలో దప్పిలి లక్ష్మమ్మ కీలకపాత్ర వహించారని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నిలకడగా పొగాకు ధరలు

పొదిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు కొనుగోల ధరలు ప్రారంభం నుంచి నిలకడగా కొనసాగుతున్నాయి. గురువారం మొత్తం 395 బేళ్లు అమ్మకానికి వచ్చాయి. గరిష్ఠ ధర కిలో రూ. 280, కనిష్ఠ ధర రూ. 255 పలికినట్లు వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ తెలిపారు. 30 బేళ్లు వెనక్కి వెళ్లినట్లు ఆయన తెలిపారు. గ్రేడింగ్, చెక్కులు కట్టేటప్పుడు జాగ్రత్తలు పాటించి నాణ్యతా ప్రమాణాలతో వేలానికి తీసుకొచ్చి మంచి ధరలు పొందాలన్నారు.

రైతు సేవా కేంద్రంలో పంట నమోదు జాబితా

బేస్తవారపేట,మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలో పంట నమోదు చేయించుకున్న రైతుల సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రంలో జాబితా ఉందని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని రెట్లపల్లె,పెద్ద ఓబినేనిపల్లె గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలు సక్రమంగా లేకపోతే సవరణ చేయించుకోవచ్చునని అన్నారు. ఉద్యాన శాఖాధికారి డి.శ్వేత మాట్లాడుతూ ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద రైతులకు తైవాన్ స్ప్రేయర్లకు 50శాతం సబ్సిడీ ఉందని,పండ్ల తోటలు సాగు చేసే రైతులకు పలు సబ్సిడీలు ఉన్నాయని వివరించారు.

తొలగిన డ్రైనేజీ సమస్య

బేస్తవారపేట,మార్చి20(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట బీసీ కాలనీలోని శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయ వీధిలో ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్యతో కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను ఆలయ ధర్మకర్త ముప్పూరి రాము గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే కాలువ ఏర్పాటుకు తగిన నిధులు మంజూరు చేయించడంతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో ఆ కాలనీలో మురుగు నీరు కాలువ ద్వారా ప్రవహించడంతో ప్రజలు అభినందనలు తెలిపారు.



వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

కొనకనమిట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగొండలో వెలుగొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా వేంకటేశ్వరస్వామి గురువారం హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు శ్రీలక్ష్మీఅలమేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామిని హనుమంత వాహనంపై కొలువుదీర్చారు. స్వామివార్లను అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం మంత్రోచ్చరణలతో స్వామి వారికి పూజలు చేశారు. భక్తులు స్వామివారి పల్లకీ మోసి తమభక్తిని చాటుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణలతో స్వామి వారు వెలుగొండ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు కొలువు దీరనున్నారు. ఈకార్యక్రమాన్ని ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కుందూరు కాశిరెడ్డి, పలువురు భక్తులు పర్యవేక్షించారు.



సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు సమస్యలు తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

● **సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్**

పెద్దారవీడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జరిగే కాటమరాజు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. మండలంలోని సుంకేసుల పరిధిలో కాటమరాజు దేవస్థానాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, యాదవ సంఘం నాయకులతో మాట్లాడారు. అన్నీ శాఖలతో సమన్వయం చేసుకొని భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖవారితో సమీక్ష నిర్వహించి తగు చర్యలు చేపడతామన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖతో శిబిరాలు ఏర్పాటు చేయించి భక్తులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లెబోయిన వెంకటరాజు యాదవ్, నాయకులు పీఎల్పీ యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గేట్ ఎంట్రన్స్‌లో మహమ్మద్‌కు 272వ ర్యాంకు

గిద్దలూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గేట్ ఎంట్రెన్స్‌లో గిద్దలూరు మండలం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ పీరావలి కుమారుడైన షేక్ మహమ్మద్‌కు ఆల్ ఇండియా స్థాయిలో 272వ ర్యాంకు లభించింది. 10వ తరగతి వరకు సంజీవరాయునిపేట జిల్లాపరిషత్ హైస్కూలులో చదివిన మహమ్మద్ ఇంటర్మీడియట్ ఒంగోలులోని ప్రతిభ జూనియర్ కళాశాలలో, గుంటూరులోని నాగార్జున యూనివర్సిటిలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివి 90శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యాడు. 2005 గేట్ పరీక్షల్లో 736 స్కోరు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 272వ ర్యాంకు సాధించాడు.

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

మార్కాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 22న శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ ద్వారా తెలియజేసుకోవచ్చన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

కంభం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కంభంలో ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గంలోని 6 మండలాల ఎంపీడీవోలకు, విస్తరణ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్‌మిత్రలకు, గ్రీన్‌కార్డు వారికి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని కంభం ఈవోఆర్‌డీ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న బేస్తవారపేట మండలం, 22న అర్ధవీడు, 24న కంభం, 25న గిద్దలూరు, 26న కొమరోలు, 27న రాచర్ల మండలాలకు ఒక్క రోజు చొప్పున శిక్షణ ఉంటుందన్నారు.

ప్రమాద బీమా నగదు అందజేత

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమానిగుడిపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుడైన మామిళ్ల దావిద్ గత ఏడాది డిసెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. అయితేఆయన ప్రధాన మంత్రి బీమా జ్యోతి పథకం కింద బీమా చెల్లించిఉన్నాడు. దీంతో ఆ పథకానికి అర్హుడుగా ఉన్నందున నామినీ అయిన ఆయన భార్య లలితమ్మకు గురువారం బ్యాంక్‌లో 2లక్షల రూపాయల నగదును అందజేశారు. బ్యాంక్ మేనేజర్ నాగేంద్రకుమార్, అసిస్టెంట్ మేనేజర్ అంజునాయక్, ఆఫీస్ అసిస్టెంట్ శివశర్మ, సిబ్బంది కాశింవలి, రాంబాబు, శ్రీనివాసులు, లింగయ్యలు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభం

రాచర్ల (గిద్దలూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాచర్లలో ప్రజావేదిక నాయకులు మల్లెబోయిన వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు.

క్రైం సమాచారం

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొమరోలు, మార్చి20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల అటవీ ప్రాంతంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న బట్టీలను గిద్దలూరు ఎక్సైజ్ సీఐ సిబ్బందితో కలసి గురువారం ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళగిరి ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహారావుతో గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎంజే రావు, సిబ్బందితో కొమరోలు మండలంలోని యర్రగుంట్ల అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 100 లీటర్ల బెల్లం ఊటను, 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మోటర్ సైకిల్‌తో పాటు ఓ వ్యక్తిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో యుసఫ్, షరీఫ్, హెడ్‌కానిస్టేబుల్ అసదుల్లా, సుమంత్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్‌పోలీసులు



శ్రీప్రసన్నాంజనేయస్వామి

నేడు శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

దర్శి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని శ్రీసువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరగనుంది. గత 55 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది పాల్గుణమాస, బహుళ సప్తమి రోజున తిరునాళ్ల ఉత్సవాలు జరపటం ఆనవాయితీ. అందులోభాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా భక్తులు ఒకరోజు ముందుగానే ఆలయానికి వచ్చి పూజలు చేయటం ప్రారంభించారు. మహిళలు శుక్ర, శనివారాలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్ల సందర్భంగా ఉదయం అభిషేకం, తదితర పూజలు నిర్వహిస్తారు. తిరునాళ్లకు టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేస్తున్నారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షణీయం

దర్శి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టసభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందటం ఆనందదాయకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక న్యాయం కోసం కృషిచేసిన నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు ప్రారంభం నుంచి కృషి చేశారన్నారు.

అందులోభాగంగా అసెంబ్లీ, శాసన మండలిలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపటంతో అర్హులైన అందరికీ న్యాయం జరిగే అవకాశం కల్గిందన్నారు. మాదిగల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణమాదిగ కృషి వలనే వర్గీకరణ సాధ్యమైందన్నారు. సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో కృషి చేయటంతో కేంద్రప్రభుత్వం కూడా ఆమోదం తెలిపిందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీలో ప్రవేశాల నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రత్యేకాధికారిణి మాధవి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

7,8,9,10, ఇంటర్ రెండో సంవత్సరంలో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తులు కోరుతున్నట్లు వివరించారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని గ్రామాల్లో అర్హులైన విద్యార్థినులు ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అడ్మిషన్ పొందాలని ప్రత్యేకాధికారిణి మాధవి పేర్కొన్నారు.

నేటి నుంచి ఎల్‌టీసీ శిక్షణ తరగతులు

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పామూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు ఎల్‌టీసీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఈనెల 27 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవోలు హాజరుకానున్నారని తెలిపారు.

తొలిరోజు పామూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, శనివారం సీఎస్‌పురం, 24న హనుమంతునిపాడు, 25న వెలిగండ్ల, 26న కనిగిరి, 27న పీసీపల్లి మండలాలకు చెందిన వారికి శిక్షణ తరగతులు జరుగుతాయని అరవింద పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతు సంఘం నాయకులు ఎం.రత్నారెడ్డి, వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎంతోకాలంగా తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోని సిబ్బంది గత వారం రోజుల నుంచి అర్జీదారులకు ఫోన్ చేసి పిలిపించుకొని సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

సీఎస్‌పురంలో ధర్నా కార్యక్రమం తలపెట్టడంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించకపోతే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

దిగుబడులు లేక.. ధర రాక..

- ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి
- నిండాముంచిన తెగుళ్లు
- మిర్చి రైతుల ఆందోళన

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్చి సాగుచేసిన రైతులకు కాయలు కోయ కుండానే కన్నీళ్లు వస్తున్నాయి. గిట్టుబాటు ధరలేక రైతులు నష్టాలు మూట గట్టుకుంటున్నారు. ఈఏడాది ఖరీఫ్, రబీలో కలిపి రూ.2555 ఎకరాలు సాగుచేశారు. వరుస తెగుళ్లు నిండా ముంచాయి. పైరు ఎదుగుదలతో పాటు దిగుబడి తగ్గింది. దీనికితోడు మార్కెట్‌లో ధర పాతాళానికి పడిపోవటంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. దీంతో కనీసం పెట్టుబడులతో పాటు కోత, కూలీ ఖర్చు కూడా రాక అల్లాడి పోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది.

ఈఏడాది మార్కెట్‌లో ధర లేకపోవటంతో బయట దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులను ఆసరా చేసుకొని రూ.పది వలే నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. బాగా పండించిన రైతులకు మాత్రం ఎకరాకు 20 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుంది. ఎక్కువ మంది రైతులు సరాసరి 15 క్వింటాళ్ళ దిగుబడి కూడా రావటంలేదు. మండలంలో అత్యధికంగా ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, శంకరాపురం, జమ్మలమడక, రామకృష్ణాపురం, మారెళ్ళ, గంగన్నపాలెం గ్రామాల్లో మిర్చి సాగును ఎక్కువగా సాగు చేశారు. గత నెల రోజుల నుంచి మిర్చి కోతలు వచ్చాయి. దిగుబడి తగ్గటంతో పాటు ధర కూడా లేక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో ఈఏడాది రెట్టింపు స్థాయిలో సాగు చేశారు. తీరా తెగుళ్ళతో పాటు ధర లేకపోవటంతో నష్టాల బాట పట్టారు.

ఈ ఏడాది మిర్చికి ఆరంభం నుంచే జెమినీ, నల్లి, తామర, కొమ్మ తెగుళ్ల సోకాయి. తెగుళ్ళను అదుపు చేసేందుకు వివిధ రకాల మందులు వాడినా అదుపులోకి రాలేదు. దీంతో పెట్టుబడి పెరగగా, దిగుబడి తగ్గిపోయింది. దానికితోడు ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది.



మిర్చిని గోతాల్లో నింపుతున్న రైతులు

కోత కూలీ ఖర్చు కూడా రావడంరాలేదు

- సంకెల నారాయణరెడ్డి, ఉమామహేశ్వర అగ్రహారం



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. వరుస తెగుళ్ళతో తీవ్రంగా నష్ట పోయాం. ధర చూస్తే పాతాళానికి పడి పోయింది. సరాసరి ఎకరానికి రూ.50 వేలు మేర నష్టం వస్తుంది. కోత ఖర్చులు కూడా రాలేదు. .

మిర్చి రైతులను ఆదుకోవాలి

- పి.జానీ, ఉమామహేశ్వర అగ్రహారం



ఈ ఏడాది మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాను. దిగుబడి బాగా పడిపోయింది. ఎకరానికి 15 క్వింటాళ్ళు కూడా రాలేదు. ఎకరానికి రూ.50 వేల మేర నష్టం వస్తుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

సచివాలయాల ప్రారంభం ఎప్పుడో..!

- పూర్తయిన నిర్మాణాలు
- అద్దె భవనాల్లో చాలీచాలని వసతులు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సచివాయాల్లో పనిచేస్తున్న సిబ్బంది చాలీచాలని అద్దెభవనాల్లో ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పామూరు మండలంలో 19 గ్రామ సచివాలయాల నిర్మాణాలు తలపెట్టారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరుచేసింది. పామూరులో మంజూరు చేసిన నాలుగు సచివాలయాల్లో కేవలం పామూరు 1వ సచివాలయం మాత్రమే ప్రారంభించారు. మిగిలిన మూడు సచివాలయాలు నిర్మాణాలు పూర్తయ్యాయి.

మండలంలోని పామూరు1, కంభాలదిన్నె, బొట్లగూడూరు, బలిజపాలెం, నుచ్చుపొద, దూబగుంట, వగ్గంపల్లి గ్రామాల్లోని సచివాలయాల భవనాలు నిర్మించి ప్రారంభించారు. మిగిలిన 12 సచివాలయాల్లో ఒకటి రెండుచోట్ల మినహా మిగిలినవి పూర్తయి ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులు పూర్తయిన సచివాలయాలకు మౌలిక వసతులు సమకూర్చి ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని పామూరు సచివాలయాలు

ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యం

- ఏవో ఎండీ ఫరూక్

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగుచేస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుందని ఏవో ఎండీ ఫరూక్ అన్నారు. పండిన పంటలను తిన్నవారు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేపట్టాలన్నారు. ఈవిధంగా పంటలు సాగు చేయటం వల్ల అధిక లాభం పొందవచ్చునని చెప్పారు. పలు పంటల వల్ల భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి మహిళ ఇంటి వద్ద స్థలంలో కూరగాయలు సాగుచేసుకొని ఇంటి ఖర్చులు తగ్గించవచ్చునని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ జె.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో ప్రతిరైతుతో వారికున్న పొలంలో ప్రకృతి సేద్యంతో పంటలు సాగు చేసే విధంగా చూడాలన్నారు. బీజామృతం, ఘన, ద్రవ, జీవామృతం, కషాయాలు, గ్రోత్ ప్రమోటర్స్ ఉపయోగాల గురించి వివరించారు.

సమావేశంలో ఏపీఎం ఎం.హనుమంతరావు, సీసీలు కోటేశ్వరమ్మ, రత్నకుమారి, వీపీఏలు, ఈవోఏలు, వ్యవసాయ శాఖ యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎం.వేణుగోపాల్, ఎం .కోటయ్య, డి.యేగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఎండీ ఫరూక్

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పెట్టుబడి తగ్గించుకొని మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చునని కనిగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ డి. విజయరాణి తెలిపారు. మండలంలోని చింతపూడు రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏవో బి.సంపత్‌కుమార్, ఏపీఎం లక్ష్మీనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కనిగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ విజయరాణి చెప్పారు. గురువారం వెలిగండ్లలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని జిళ్ళెలపాడు, కొటాలపల్లి గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో రంగాకృష్ణ, ఏపీఎం జీవరత్నం, సీసీలు శ్రీను, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

దర్జా కోల్పోతున్న దర్జీలు

- వృత్తిపరమైన ప్రభుత్వ పథకాలు అందక అవస్థలు
- రెడీమేడ్ దుస్తులతో కుదేలు

దొనకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దర్జీల జీవితాల్లో దర్జా కరువైంది. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన టైలర్ వృత్తి రెడీమెడ్ దుస్తుల రాకతో క్రమేనా మసకబారుతుంది. శుభకార్యాలు, పండుగ రోజుల్లో చేతినిండా పనిఉండేది. ప్రస్తుతం వారి జీవితాలు ముందుకు సాగటం లేదు. తగినంత పని దొరక్క ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సిన దుస్థితిలో ఉన్నారు. మరికొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో పనిదొరికినా దొరక్కపోయినా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు.

మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో దాదాపు వందకు పైగా టైలర్లు కుట్టు మిషన్లు నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నట్లు సమాచారం. పగలంతా కుట్టు మిషన్‌పై కూర్చున్నా ఒక్కోరోజు రోజుకూలి సహితం గిట్టుబాటు కావటం లేదని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లోని ప్రజలు శుభకార్యాలు, ప్రధాన పండుగలకు రెండు రోజుల ముందు గుంటూరు, వినుకొండ, మార్కాపురం, దర్శి తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లి రెడీమెడ్ దుస్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం దొనకొండలోనే రెడీమెడ్ దుకాణాలు ఏర్పాటయ్యాయి. రెడీమెడ్ దుస్తుల వ్యాపారం జోరందుకొని తమ జీవితాలు దుర్భరంగా మారినా ప్రభుత్వం నుంచి వృత్తిపరంగా తమకు ఎటువంటి ప్రోత్సాహం అందటం లేదని టైలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

- నున్నా శ్రీను, టైలర్, దొనకొండ



అప్పట్లో ప్రధాన పండుగల నెలరోజులు ముందునుండి పండుగ రోజు వరకు క్షణం తీరిక ఉండకుండా నాతో పాటు మరో ఇద్దరు, ముగ్గురికి టైలరింగ్ ద్వారా ఉపాధి ఉండేది. ప్రస్తుతం నా కుటుంబానికే జీవనోపాధి భారమయ్యేలా టైలరింగ్ వృత్తి దిగజారిపోయింది. ప్రభుత్వం నుండి తమకు వృత్తిపరమైన ఎటువం టి ప్రోత్సాహం అందడంలేదు.



దొనకొండలో దుస్తులు కుడుతున్న టైలర్ ప్రభాకర్

మేత కోసం మూగజీవాల వలసబాట

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మేత కోసం మూగ జీవాలు వలసబాట పట్టాయి. పశ్చిమ నీటి ఎద్దడితో పాటు పశుగ్రాసం కొరత ఏర్పడటంతో పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, దోర్నాల ప్రాంతాలకు చెందిన ఆవులు వలసబాట పట్టాయి. గురువారం పుల్లలచెరువు మండలం నుంచి బాపట్ల జిల్లాలోని రేపల్లె, కర్లపాలెం, నగరం ప్రాంతాలకు వలస బాటపట్టాయి. ముండ్లమూరులో ఆంధ్రజ్యోతి పశుపోషకులను పలకరించగా, పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందన్నారు. రేపల్లె ప్రాంతంలో ఎండాకాలం అంతా ఉండి జూన్‌లో స్వగ్రామాలకు వస్తామని పశుపోషకులు తెలిపారు.



మేత కోసం వలస వెళ్తున్న ఆవులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కొండారెడ్డి

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలి

కనిగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జీవీ కొండారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పామూరు బస్టాండు సెంటరులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కనిగిరి, దర్శి పట్టణాల్లో ఇంటింటికి తాగు నీటి కుళాయిల ద్వారా సరఫరా అందించే స్కీం నిర్మాణం చేపట్టాలన్నారు. సంగమేశ్వరం, పాలేటిపల్లి రిజర్వాయర్‌లకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. దొనకొండ కారిడార్, కనిగిరిలో నిమ్జ్ పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు పూర్తిచేసి వచ్చే దసరా నుంచి రైలు నడపాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, పీసీ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ జడ్పీటీసీ మృతి



హుసేన్‌రావు యాదవ్(ఫైల్)

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ మొరబోయిన హుసేన్ రావు యాదవ్ (60) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హుసేన్‌రావు సోదరులు ఎం.నరసింహారావు మోపాడు ప్రాజెక్టు సూపర్ వైస్‌చైర్మన్‌గా, ఎం.గంగరాజు టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ ఉపాధ్యక్షుడిగా, ఎం.గిడ్డయ్య యాదవ్ మోపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, భైరెడ్డి జయరామిరెడ్డి మోపాడు హుసేన్‌రావు మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఉగ్ర ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. ప్రగాఢ సానుభూతి తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, కదిరి విద్యా సంస్థల కరస్పాండెంట్ పార్థసారథి, సర్పంచ్‌లు దేవనబోయిన సుబ్బయ్య, దాసరి చినమాలకొండయ్య, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీలు ఉప్పలపాటి హరిబాబు, చప్పిడి రామయ్య, కామిరెడ్డి తిరుపతిరెడ్డి, మహంకాలి వెంగయ్య, బండ్ల నారాయణ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం.ముసలయ్య, టి.రమేష్, తదితరులు ఉన్నారు.

ఎర్రగొండపాలెంకు బస్సు సర్వీసు పునఃప్రారంభం

దొనకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలోని పలుగ్రామాల మీదుగా ఎర్రగొండపాలెం కు గతంలో పొదిలీ ఆర్టీసీ డిపో బస్సు నడిచేది. వివిధ కారణాలతో కొన్ని నెలల క్రితం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును నిలిపివేశారు. మండలంలోని తెల్లబాడు, నల్లబోతులవారిపాలెం, ఆరవల్లిపాడు, దొండపాడు, పెద్దన్నపాలెం, ఎన్‌ఎన్‌పాలెం, దొనకొండ, రుద్రసముద్రం, పల్లాయిపల్లి, కొచ్చెర్లకోట తదితర గ్రామాలకు చెందిన ప్రజలకు దోర్నాల, శ్రీశైలం, హైదరాబాద్ మరికొన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఆర్టీసీ అధికారులు బస్సును రద్దు చేయటంతో ఇబ్బందులు పడ్డారు. పొదిలి నుంచి వైపాలెం బస్సు పునఃప్రారంభం కావటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, దొనకొండ ప్రాంత ప్రజల సౌకర్యార్థం దొనకొండ నుంచి దర్శి మీదుగా ఒంగోలుకు బస్సు సర్వీసు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



ఎర్రగొండపాలెంకు ప్రారంభమైన ఆర్టీసీ సర్వీసు

డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి



ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కనిగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని చెప్పి ఇంతవరకు ఆదిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఇచ్చిన మాట తప్పి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. జిల్లాలో ఎస్జీటీ పోస్టులు తక్కువగా ఉన్నాయని చెప్పటం పట్ల నిరుద్యోగులు అసంతృప్తగా ఉన్నారన్నారు. జిల్లాలో ఎస్జీటీ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పి. నరేంద్ర, నారాయణ, శ్రీను, పాండు తదితరులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో చోరీ

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నాగార్పమ్మ అమ్మవారి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు గురువారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలు పగులగొట్టి హుండీ చోరీకి పాల్పడ్డారు. హుండీ రూ. పది వేలకు పైగా నగదు ఉంటుందని ఆలయ పూజారి తెలిపారు. ఆలయంలో భక్తులు పూజ చేయటానికి ఉదయం వెళ్ళగా తలుపులు పగులగొట్టి ఉండటంతో ఆందోళన చెందారు. ఇటీవల మండలంలో ఆలయాల్లో చోరీలు ఎక్కువయ్యాయి.



నాగార్పమ్మ ఆలయం

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ

పీసీపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ గృహ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరణ చేసుకుంటే ప్రభుత్వం 50శాతం రాయితీ ఇస్తుందని ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపారు. సాధారణంగా ఒక కిలో వాట్ లోడు క్రమబద్ధీకరణ కోసం గృహ వినియోగదారులు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు క్రమబద్ధీకరించుకుంటే కేవలం రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఈఅవకాశం జూన్ 30 వరకు ఉందన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.







మోటుపల్లికి మహర్దశ



- గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌక తయారీ కేంద్రం ఏర్పాటుపై ఆశలు
- గతంలో కేంద్ర బృందం అనుకూలంగా నివేదిక
- తాజాగా కేంద్ర మంత్రి సానుకూల స్పందన
- రెండు కీలక ప్రాజెక్టులు ముందడుగుపై ప్రజల హర్షం

కేంద్ర బృందం పరిశీలించిన మోటుపల్లి తీర ప్రాంతం (ఫైల్ ఫోటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో ఓడల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ఏడు నెలల క్రితం కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు అనువైన ప్రాంతం పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలో ఉందనే అభ్యర్థనలను స్థానిక నాయకత్వం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆ వినతులను కేంద్రం ముందుంచింది. చినగంజాం మండలంలోని మోటుపల్లిలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడంతో పాటు పక్కనే సముద్ర తీరం ఉందని ఓడల తయారీ క్లస్టర్ నిర్మాణానికి కలిసొచ్చే అంశంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. ఈ నేపథ్యంలో గతేడాది అక్టోబరులోనే కేంద్ర బృందం మోటుపల్లి తీరంలో పర్యటించి నివేదికలను రూపొందించింది. దీనికి కొనసాగింపుగా నౌక నిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలతో నివేదిక ఇవ్వాలని మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఇటీవలే అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే మోటుపల్లి-పెదగంజాం మధ్య ఉన్న తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కూడా నిర్మించాలనే అభ్యర్థనలు కూడా పెద్ద సంఖ్యలో కేంద్రానికి అందాయి. మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి ఈ విషయమై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. గతంలో కేంద్ర బృందం ఇక్కడ పర్యటించిందనే విషయాన్ని గుర్తు చేయడంతో పాటు మారిటైం బోర్డు సానుకూలంగా ఇచ్చిన నివేదికలను సైతం కేంద్రమంత్రికి ఆయన అందజేశారు. ఈ అభ్యర్థనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, మోటుపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో పాటు నౌక నిర్మాణ కేంద్రాలకు అనుకూలంగా ఉంటుందనే విశ్వాసాన్ని రాష్ట్ర మంత్రి జనార్థన్‌రెడ్డి వ్యక్తం చేశారు. రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో ముందడుగు పడడంతో పర్చూరు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అటు పారిశ్రామికంగా, ఇటు పర్యాటకంగా కూడా త్వరలోనే మోటుపల్లికి మహర్దశ దక్కే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి



ఢిల్లీలో కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి

అనుకూలతలు..

- నౌక నిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు 1300 ఎకరాలు, పోర్టుకు మరో 600 ఎకరాల వరకు కావాలి. ఈ స్థాయిలోనే ప్రభుత్వ భూమి మోటుపల్లి తీరంలో అందుబాటులో ఉంది.
- బకింగ్‌హామ్ కెనాల్‌కి సమీపంగానే సముద్రం ఉంది.
- నౌకల నిర్మాణం పూర్తి కాగానే వాటిని సముద్ర మార్గం ద్వారా ఆయా రాష్ట్రాలు, దేశాలకు తరలించడానికి ఈ ప్రాంతం అనుకూలం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి

కీలకమైన ఈ రెండు ప్రాజెక్టులను మోటుపల్లి తీరంలో ఏర్పాటు చేసే విధంగా కేంద్రాన్ని ఒప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నౌక నిర్మాణ పరిశ్రమపై కేంద్రం బృందం ఇచ్చిన నివేదికలు కూడా అనుకూలంగానే ఉండడంతో నిర్మాణ క్లస్టర్ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగాయని సమాచారం. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు విషయంలో మాత్రం కేంద్ర బృందం పరిశీలన తర్వాతనే ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే కేంద్ర బృందం చినగంజాం మండలంలో పర్యటించి గ్రీన్‌ఫీల్డ్ పోర్టును మోటుపల్లి తీరంలో ఏర్పాటు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించనుంది. ఇటీవలే మోటుపల్లి తీరంలో పర్యటించిన కలెక్టర్ వెంకటమురళి ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని కూడా ఆదేశించారు. నౌక నిర్మాణ పరిశ్రమ, పోర్టు నిర్మాణాలకు ఉన్న అనుకూలతలపై కేంద్రానికి వివరించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది. పర్యాటకంగా మోటుపల్లిని అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కాకతీయులు, చోళ రాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చినగంజాంలో భద్రపరచడానికి మ్యూజియం నిర్మాణం చేపట్టి పర్యాటకులను ఆకర్షించే దిశగా కూడా కృషి చేస్తామన్నారు.

- గుంటూరులో బయ్యర్ల బినామీ వ్యాపారం
- ఒక్క కేంద్రంలోనే 1.80 లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత.. కొందరికి రూ.3 కోట్లు లబ్ధి

కొనుగోల్‌మాల్

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

కొందరు బయ్యర్లు అత్యధికంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మేలు చేసేందు కోసం కొనుగోలు చేస్తున్నారని అందరూ అనుకున్నారు. తీరా అసలు విషయం చూస్తే.. ఇదో పెద్ద కొను'గోల్‌మాల్' అని తేలింది. వారి అసలు గోల్ (లక్ష్యం) అర్థమయ్యాక అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గుంటూరు పరిధిలోని సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒకే ఒక్క కేంద్రంలో అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. జిన్నింగ్ మిల్లులు యజమానుల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గాయత్రీ కాటన్ ప్రొడక్టు, శ్రీ సాయి ట్రేడర్స్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పత్తి కొనుగోలుకు ఇద్దరు బయ్యర్లు మారారు. గాయత్రీ కాటన్ ప్రొడక్టులో అతి తక్కువగా 4626.75 క్వింటాళ్లు, శ్రీ సాయి ట్రేడర్స్‌లో 20281 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. అతి తక్కువగా పత్తి కొనుగోలు చేయడం వల్ల యార్డుకు వచ్చిన ఆదాయం కూడా కేవలం రూ.17 లక్షలు మాత్రమే. ఇదే మిల్లులకు అతి సమీపంలో గుంటూరు-ఏ, గంపలగూడెం యార్డులకు చెందిన జిన్నింగ్ మిల్లుల్లో భారీగా కొనుగోలు జరిగింది. ఇక్కడ వేరే వ్యక్తులు మిల్లులు అద్దెకు తీసుకుని జిన్నింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల వెనుక బయ్యర్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కేంద్రాలకు ఎంత అన్యాయం జరిగిందో అర్థం అవుతుంది. ఉదాహరణకు గంపలగూడెం యార్డు పరిధిలోకి వచ్చే ఓ మిల్లులో 87448.16 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, మరో కేంద్రంలో ఏకంగా 1.17 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఒకే ఒక్క కేంద్రంలో సుమారు రూ.86 కోట్ల విలువ చేసే పత్తిని కొన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు -ఏ కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో కొనుగోళ్లు జరిగాయి. వాస్తవానికి జనవరి నెలకు పత్తి రావడం పూర్తిగా తగ్గిపోతుంది. అయితే ఆశ్చర్యంగా గుంటూరు- ఏ, గంపలగూడెం కేంద్రాల్లో అన్ సీజన్‌లో కూడా 5 వేల క్వింటాళ్లకు తగ్గకుండా పత్తిని కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

తెర వెనుక ప్రయోజనం వేరు..

కొన్ని సీసీఐ కేంద్రాల్లో పత్తి ఎక్కువగా కొనుగోలు చేయడంలో తెరవెనుక దాగిన ప్రయోజనాలు మాత్రం వేరుగా ఉన్నాయి. ఎక్కడైతే ఎక్కువ పత్తి కొనుగోలు జరిగిందో అక్కడ క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత బాగా విధించారు. ఆయా కేంద్రాల్లో క్వింటాల్‌కు 5 కిలోల నుంచి 7 కిలోల వరకు కోత విధించారు. ఈ లెక్కన ఒక్క బయ్యర్ 1.80 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే ఎంత మిగులు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా పక్కకు తీసిన పత్తి జిన్నింగ్ వేయగా వచ్చిన దూదిని విక్రయించారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న ఆయా కేంద్రాల్లో కొందరికి సుమారు రూ.3 కోట్ల వరకు అదనపు లాభాలు వచ్చినట్లు ఆరోపణలున్నాయి.

- రైతులు, వ్యాపారులకు ఎంతో మేలు
- ఎగుమతి, దిగుమతులు సులభతరం
- గూడ్స్‌ను ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్లలోనూ రైల్వేరాక్


బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో రైల్వేరాక్ మూమెంట్ రావడం హర్షణీయమని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. గురువారం బాపట్ల రైల్వేస్టేషన్‌లో రైల్వేరాక్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేరాక్‌తో జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. గతంలో చీరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై బాపట్ల నుంచే ధాన్యం, ఇతర సరుకులు ఎగుమతి, దిగుమతి చేసుకోవచ్చన్నారు. దీనివల్ల రైతులు, వ్యాపారులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. బాపట్ల వ్యవసాయాధారిత జిల్లా కాబట్టి ఇక్కడి వారికి ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ పంటలు విస్తారంగా పండే జిల్లా కేంద్రంలో లోడింగ్, ఆన్‌లోడింగ్ పాయింట్ రావడం వల్ల రైతులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గూడ్స్ రాకల ద్వారా నిత్యావసరాలు, ఎరువులు, దిగుమతి, ఎగుమతి చేసుకోవచ్చన్నారు. బాపట్ల స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్టాప్ కోసం వినతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, రైల్వేస్టేషన్ మాస్టర్ మీనా, బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్‌మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (శుక్రవారం ఉదయం)
సహరి : 4.55 (శనివారం ఉదయం)



బాపట్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలును ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు తదితరులు

- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- గత ఆడిట్‌లో వెలుగుచూసిన అక్రమాలు
- రుణాల పేరిట బ్యాంకు సొమ్ము దారిమళ్లింపు
- రూ.425 కోట్లు గల్లంతు.. మొండిబకాయిలంటున్న అధికారులు
- బ్యాంకు శాఖల్లో అందుబాటులో లేని రుణ గ్రహీతల వివరాలు
- 2022లో సీఐడీ విచారణపై లేఖ.. నాడు అడ్డుకున్న వైసీపీ నేతలు





జీడీసీసీబీపై.. సభా సంఘం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంటూరు డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీ)ను నిలువునా దోచేశారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము అందిన కాడికి కాజేశారు. అధికారం అండ.. పాలకవర్గం, అధికారుల సహకారంతో అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా అక్రమాలను గుర్తించినా విచారణలకు అక్రమార్కులు అడ్డుతగులుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నాడు అధికారాన్ని అడ్డంపెట్టుకుని జీడీసీసీబీని అడ్డంగా దోచేసిన అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జీడీసీసీబీ అక్రమాలపై సభా సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. దీంతో జీడీసీసీబీలో గత ఐదేళ్లలో అక్రమాలకు పాల్పడిన రాజకీయ నేతలు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జీడీసీసీబీలో జరిగిన ఎన్నో అక్రమాలు గత ఆడిట్ నివేదికలోనే వెలుగుచూశాయి. జీడీసీసీ అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదుతో ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా సహకార శాఖ అధికారిని నియమించారు. ఈ విచారణపై కూడా అందరూ పెదవి విరిచారు. దాని వల్ల అక్రమాలు బయటకు రావని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సభా సంఘం ఏర్పాటుకు అడుగు పడింది. కొందరు వైసీపీ నేతలు బినామీలు, నకిలీలను అడ్డంపెట్టుకుని రుణాల పేరట జీడీసీసీ, సహకార సంఘాల్లో వందల కోట్లు దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం సభా సంఘం వేయడంతో అక్రమార్కులపై ఈ సారి తప్పకుండా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎన్నెన్నో అక్రమాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు రూ.425 కోట్లు గల్లంతైనట్లు గత ఆడిట్‌లో నిర్ధారించారు. అధికారులు వీటిని మొండిబకాయిలు అని చెబుతున్నారు. అయితే ఆయా రుణ గ్రహీతల వివరాలు బ్యాంకులో అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలను అడ్డంపెట్టుకుని రుణాల పేరిట నాటి అధికార పార్టీ నేతలు బ్యాంకు సొమ్ము దారిమళ్లించారని తెలుస్తోంది. జీడీసీసీ బ్యాంకుతో పాటు, సహకార సంఘాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు 2022లోనే అధికారులు గుర్తించారు. అప్పుడే ఓ అధికారి ఆయా అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు సమాచారం. అయితే ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రముఖ నేతలు సీఐడీ విచారణకు అడ్డుతగిలినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, నల్లపాడు, రెడ్డిపాలెం, గోరంట్ల, కాకుమాను, పెదనందిపాడు, పల్నాడు జిల్లాలోని గురజాల తదితర ప్రాంతాల్లో ఒకరి పేరుతో వేరొకరు రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మంది నకిలీలను సభ్యులుగా చేర్చుకుని వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ.2.99 కోట్లు మంజూరు చేశారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఈ అక్రమాల్లో జీడీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల్లోని సిబ్బంది పాత్ర కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో జీడీసీసీబీకి చెందిన 9 మంది మేనేజర్లు, ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్లు, ఓ క్యాషియర్, ఐదుగురు సూపర్‌వైజర్లు, మరికొందరు రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది.



బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రంలో నూతన హంగులతో నిర్మించిన పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్

- నాడు టీడీపీ హయాంలో నిర్మాణం
- గత ఐదేళ్లు పాడుపెట్టిన వైసీపీ పాలకులు
- తుది మెరుగులు.. త్వరలో ప్రారంభోత్సవం

పోస్ట్ హార్వెస్ట్ సెంటర్ సిద్ధం

బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల పరిధిలో పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్(కోత అనంతరం సాంకేతిక పరిజ్ఞానకేంద్రం) ఆధునిక హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విక్రయించి అధిక లాభాలు ఆర్జించేందుకు శిక్షణ, అవగాహన కల్పించే విధంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఎప్పటి నుంచో వ్యవసాయ కళాశాలలో ఉన్న ఈ సెంటర్‌కు సొంత భవనం నిర్మించి రైతులకు శిక్షణ, అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని ప్రారంభించకుండా వైసీపీ పాలకులు ఐదేళ్లు పాడుపెట్టారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమం దృష్ట్యా తిరిగి ఆ భవనంపై దృష్టి సారించింది. భవనంలో కావాల్సిన ఏర్పాట్లు చేయించి, రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. వ్యవసాయోత్పత్తులను ప్రాసెసింగ్ చేసే యంత్రాలు పెట్టేందుకు పెద్ద షెడ్ కూడా నిర్మించారు.



యంత్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన కట్టడం

తక్కువ ధరకు శుద్ధి చేస్తాం

పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రాసెసింగ్ చేసే యంత్రాలు ఉన్నాయి. పసుపుకొమ్ములను ఉడకపెట్టేందుకు ఆవిరి యంత్రం, పసుపు గ్రేడర్, పసుపు పాలిషర్, మిరపకాయలు ఆరుదల యంత్రం, ఎండు మిరపను గోతాలలో తొక్కే యంత్రం, చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసే యంత్రం, అటుకులు, మరమరాలు, చిరుధాన్యాలు పొట్టు తీసే యంత్రం, బద్ధలు చేసే యంత్రం ఇక్కడ ఉన్నాయి. వీటి వినియోగం గురించి రైతులకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తాం. అవసరమైన వారికి తక్కువ ధరకు శుద్ధి చేసి ఇస్తాం.



-డాక్టర్ ఎల్.ఏడుకొండలు, ప్రధాన శాస్త్రవేత్త



శ్రీరామ పట్టాభిషేకం చేస్తున్న వేదపండితులు

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

చినగంజాం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం గ్రామంలోని భూ, నీళా సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో శ్రీరామకోటి 19వ వార్షిక శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఆలయ అర్చకులు బృందావనం రాఘవ కుమారచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞీకులు పరాకుంశం రఘునాథాచార్యులు, బృందావనం భావనారాయణాచార్యులు, శ్రీనివాస దీక్షితులు, నారాయణం కల్యాణచక్రవర్తి విశ్వక్సేన ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, అష్టాక్షరి, గాయత్రి సీతారామ హనుమ మంత్ర హోమం, కిరీట సమర్పణ తదితర పూజలను నిర్వహించారు. తదనంతరం టీడీపీ వెంకటేశ్వరస్వామి కల్యాణ వ్యాఖ్యాత వాకాని రామకృష్ణశేషసాయి ఆధ్వర్యంలో వేదపండితులు సీతారామలక్ష్మణ, హనుత్‌స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి ఆసోది శివకృష్ణారెడ్డి, పల్లవి, శ్రీనివాసరెడ్డి, వెంకటసాయిప్రసన్న దంపతులచే స్వామి వారికి వేదమంత్రోచ్చరణ నడువ శాస్త్రోక్తంగా పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలని వినియోగం చేశారు. ఈ నెల 10వ తేది నుండి ఆలయ ప్రాంగణంలో పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణ పారాయణ సహిత హరేరామ నామ సవాహము కార్యక్రమం ముగించింది. ఆసోది నాగేంద్రారెడ్డి, అంకమ్మ దంపతులు ఆలయ ప్రాంగణంలో రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ ఆసోది దశరథరామిరెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇంకొల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నాగులచెరువుకట్టపై సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాకింగు ట్రాక్ ఏర్పాటు, చెరువుకట్టకు ఉత్తరపువైపున కాల్వ నిర్మాణపు పనులకు గురువారం శంకుస్థాపన చేసారు. చెరువుకట్టపై రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు చెరువుకట్టకు ఉత్తరపు వైపున మురుగునీరు చెరువులోకి చేరి నీరు కలుషితం అవుతుండగా, అక్కడ సుమారు రూ.34లక్షలతో కాలువ నిర్మాణం చేయనున్నారు. గురువారం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలేరు మార్క్, కరి శ్రీనివాసరావు, బోడావుల శివయ్య, వినోద్ పాల్గొన్నారు.

కంది పంట అగ్నికి ఆహుతి

- ఫైర్ ఇంజన్లకు అదుపు కాని మంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పామూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాపు మీద ఉన్న కంది పంటకు కొందరు ఆకతాయిలు అంటించిన మంటలకు దగ్ధమైంది. గురువారం మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో కంది పంటకు అనుకోకుండా మంటలు అంటుకున్నాయి. సుమారు 150 ఎకరాల్లో కంది పంట అగ్నికి ఆహుతి అయ్యింది. మంటలను అదుపు చేసేందుకు కనిగిరి, కందుకూరు నుంచి ఫైర్ ఇంజన్లు యత్నించినా సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కంది కింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో రైతులు కంది కోతలు ప్రారంభిస్తు తరుణంలో ఇలా జరగటంతో తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ. 25 వేలు ఖర్చు పెట్టామని రైతులు పేర్కొన్నారు. అగ్నికి ఆహుతి అయిన కంది పంటను తహసీల్దార్, మండల వ్యవసాయాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలనిమండల తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, నాయకులు గోళ్ల వీరబాబు, ఏలూరి నరశింహారావు, గోళ్ల బాస్కరరావు, రమణయ్య పేర్కొన్నారు. బాధిత బాదిత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు లేక.. ధర రాక

- ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి
- నిండాముంచిన తెగుళ్లు
- మిర్చి రైతుల ఆందోళన

ముండ్లమూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్చి సాగుచేసిన రైతులకు కాయలు కోయ కుండానే కన్నీళ్లు వస్తున్నాయి. గిట్టుబాటు ధరలేక రైతులు నష్టాలు మూట గట్టుకుంటున్నారు. ఈఏడాది ఖరీఫ్, రబీలో కలిపి రూ.2555 ఎకరాలు సాగుచేశారు. వరుస తెగుళ్ల నిండా ముంచాయి. ఫైరు ఎదుగుదలతో పాటు దిగుబడి తగ్గింది. దీనికితోడు మార్కెట్‌లో ధర పాతాళానికి పడిపోవటంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. దీంతో కనీసం పెట్టుబడులతో పాటు కోత, కూలీ ఖర్చు కూడా రాక అల్లాడి పోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది.

ఈఏడాది మార్కెట్‌లో ధర లేకపోవటంతో బయట దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులను ఆసరా చేసుకొని రూ.పది వలే నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. బాగా పండించిన రైతులకు మాత్రం ఎకరాకు 20 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుంది. ఎక్కువ మంది రైతులు సరాసరి 15 క్వింటాళ్ళ దిగుబడి కూడా రావటంలేదు. మండలంలో అత్యధికంగా ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, శంకరాపురం, జమ్మలమడక, రామకృష్ణాపురం, మారెళ్ళ, గంగన్నపాలెం గ్రామాల్లో మిర్చి సాగును ఎక్కువగా సాగు చేశారు. గత నెల రోజుల నుంచి మిర్చి కోతలు వచ్చాయి. దిగుబడి తగ్గటంతో పాటు ధర కూడా లేక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో ఈఏడాది రెట్టింపు స్థాయిలో సాగు చేశారు. తీరా తెగుళ్ళతో పాటు ధర లేకపోవటంతో నష్టాల బాట పట్టారు.

ఈ ఏడాది మిర్చికి ఆరంభం నుంచే జెమినీ, నల్లి, తామర, కొమ్మ తెగుళ్ల సోకాయి. తెగుళ్ళను అదుపు చేసేందుకు వివిధ రకాల మందులు వాడినా అదుపులోకి రాలేదు. దీంతో పెట్టుబడి పెరగగా, దిగుబడి తగ్గిపోయింది. దానికితోడు ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది.

నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

ఇప్పటికే పలు శాఖలపై స్పష్టత

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే అత్యధిక నామినేటెడ్ పదవులపై ఆయా నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కాలం దాటడంతో ఆశావాహులు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో ప్రధానంగా రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరజింహస్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి పదవులతో పాటు 31 సొసైటీలకు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మిగిలిన పలు దేవాలయాలకు కూడా ధర్మకర్తల మండళ్లు నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అయితే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నామినేటెడ్ పదవులపై ఆయా మండలాల, గ్రామాల నేతలతో చర్చించి పూర్తి స్థాయిలో కసరత్తు చేసి ఒక స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో కొరిశపాడు మండలానికి కేటాయించే అవకాశం కనిపిస్తుంది. సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓసీ జనరల్‌కు రిజర్వు కావడంతో సంతమాగులూరు మండలంలోని టీడీపీ నేతకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇక డైరెక్టర్లుగా అన్ని సామాజిక వర్గాలకు ప్రధాన్యం ఇస్తూ భర్తీ చేసే అవకాశం ఉంది. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆనవాయితీగా వస్తున్న ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించే క్రమంలో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అద్దంకి పట్టణ నేతకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా పట్టణంలోని వడ్డెర సామాజికవర్గానికి చాన్స్ దక్కనుంది. సుదీర్ఘ కాలం నుంచి టీడీపీకి సేవలందిస్తున్న నేతకు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆయా నేతలకు పదవులపై స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. నియోజకవర్గంలో మొత్తం 31 సొసైటీలు ఉండగా, ఇంకా ఎన్నికలు జరగకపోవడంతో త్రీమేన్ కమిటీలను నియమించనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని సొసైటీలకు జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. కొద్ది సొసైటీల విషయంలో ఆయా గ్రామాల నేతలు పోటీపడ్డప్పటికీ చర్చించి అందరి ఆమోదయోగ్యంగా జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. బల్లికురవ, రావినూతల, వెల్లలచెరువు సొసైటీలకు ఎక్కువ మంది పోటీ పడినట్లు తెలుస్తుంది. ఎవరికి వారే మంత్రి గొట్టిపాటిని కలిసి తమకు అవకాశం కల్పించాలని తీవ్ర ప్రయత్నాలు కూడా చేసినట్లు సమాచారం. బల్లికురవ సొసైటీ విషయంలో ఇద్దరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. త్వరలో అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేసే అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దీంతో 9 నెలలుగా ఎదురు చూస్తున్న నేతలకు త్వరలో పదవులు దక్కే అవకాశం కనిపిస్తుంది.



అద్దంకి మార్కెట్ యార్డ్ కార్యాలయం

సరిచేయకుంటే.. మీపని సరి

- ఒరిగిన కరెంట్ స్తంభాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం విద్యుత్ శాఖకు కచ్చితంగా వర్తిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రమాదాలు జరగకముందు ఎన్ని సార్లు చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు పెడచెవిన పెడతారని, ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అప్పుడు మాత్రం ఆఘమేఘాల మీద పరుగులు తీసి పనులు చేస్తారని పలువురు రైతులు అంటున్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఊరచెరువు కట్ట వెంబడి దామావారి పాలెం నుంచి ఇటుక బట్టీల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. వాటిలో ఆరు పోల్స్ ఒరిగిపోవడంతో అటువైపు వెళ్లే రైతులు బిక్కు బిక్కు మంటూ వెళ్తున్నారు. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే కరెంట్ స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.



అద్దంకి పట్టణంలోని ఊరచెరువు కట్ట వెంబడి ఇటుకబట్టీల రోడ్డులో ఒరిగిన స్తంభాలు



పూర్తి గా ఒరిగి ఉన్న కరెంట్ పోల్



అన్నదమ్ములు అభి, పాల్ మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చెరువులో పడి అన్నదమ్ముల మృతి

కురిచేడులో విషాదఛాయలు

కురిచేడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి అన్నదమ్ములు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం కురిచేడులోని పడమర హరిజనవాడలో చోటుచేసుకుంది. బత్తుల నరసింహులు కల్పన దంపతుల కుమారులు అభి (10), పాల్ (8) స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5, 3వ తరగతులు చదువుతున్నారు. సాయంత్రం వారింటికి ఇంటికి దగ్గరలో ఉన్న చిన్న చెరువుకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు అభి చెరువులో జారి పడిపోయాడు. దీనిని గమనించిన తమ్ముడు పాల్ పరుగున తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్న మరో బాలుడిని తీసుకుని చెరువు వద్దకు వచ్చాడు. అన్న కనపడక పోవడంతో రక్షిస్తానంటూ చెరువులోకి దూకబోయాడు. పక్కనే ఉన్న పిల్లవాడు వారిస్తున్నా వినకుండా పాల్ సైతం అన్నకోసం చెరువులోకి దూకి నీటిలో మునిగిపోయాడు. వెంటనే పక్కనే ఉన్న బాలుడు ఈ విషయాన్ని పిల్లల కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు వెంటనే వెళ్ళి చెరువులో వెతికి పిల్లల మృత దేహాలను బయటకు తీశారు. ఇద్దరు పిల్లల మృతితో నరసింహులు, కల్పనలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గ్రామంలో ఎవరికి ఏ అనవరం వచ్చినా చెరువులో మట్టిని తవ్వకుంటారు. దీంతో చెరువులో గుంతలు ఏర్పడి వాటిల్లో నీరు నిలుస్తుంది. ఆ గుంతల లోతు ఎవరికి అర్థం కావడం లేదు. చిన్నారులు సైతం ఆ గుంతల లోతు అర్థంకాకనే దిగి మునిగి ఉంటారనే గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

తర్లుపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం పోతలపాడులో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ శీను(50) తనకున్న 4 ఎకరాల భూమితోపాటు మరో 2 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, టమాటా, కంది పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా 3 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. వరుసగా మూడేళ్ల నుంచి వేసిన పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడులు రాలేదు. వచ్చిన కొద్దిపాటి పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పులయ్యాయి. ఇటీవల మిర్చి బస్తాలను యార్డుకు తీసుకెళ్లగా సరైన ధర పలకలేదు. దీంతో అయినకాడికి అమ్ముకుని వచ్చాడు. విషయం తెలిసిన అప్పులిచ్చినవారు బాకీ తీర్చాలని గట్టిగా ఒత్తిడి చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో బుధవారం రాత్రి మిర్చికి పిచికారీ చేసేందుకు తెచ్చుకున్న పురుగు మందును తాగాడు. గంట తర్వాత కుటుంబసభ్యులు గమనించి హుటాహుటిన మార్కాపురంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు శ్రీను మృతితో కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

ఏఆర్ ఎస్ఐ రవి సస్పెన్షన్

- తాలూకా ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన వైనం
- చర్యలు తీసుకుంటూ ఐజీ ఉత్తర్వులు

ఒంగోలుక్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాను సివిల్ ఎస్ఐనంటూ వసూళ్లకు దిగిన ఏఆర్ ఎస్ఐ కే.రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసు శాఖలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్ ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీకి వెళ్లి తాను ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నానని అధికారులకు గెట్ టూ గెదర్ కార్యక్రమం ఉందని చెప్పాడు. అందుకు రూ.2 లక్షలు నగదు కావాలని కోరాడు. ఈ మేరకు కళాశాల యజమాని రూ.2లక్షలు ఇచ్చారు. కొద్దిరోజులు తర్వాత ఈ విషయం కళాశాల యజమాని, తాలూకా సీఐకి తెలియపరిచారు. దీంతో సీఐ విస్తుపోయి తనకు తెలియకుండా డబ్బులు తీసుకున్న ఎస్ఐ ఎవరని విచారణ చేశారు. ఫోన్ నంబరు ఆధారంగా ఏఆర్ ఎస్ఐ రవికుమార్ అని తేల్చారు. ఈ మేరకు సీఐ అజయ్‌కుమార్ ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాఖాపరమైన విచారణ చేసిన అనంతరం గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి నివేదిక అందజేశారు. ఆ మేరకు ఆయన ఏఆర్ ఎస్సై రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వెలిగొండ ప్యాకేజీ-4కు రూ.282.33 కోట్ల అదనపు నిధులు

అధికంగా ఆయకట్టు, పలు కీలక పనులు ఇందులోనే..

ఒంగోలు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ప్యాకేజీ-4 పనులకు రూ.282.33 కోట్లు అదనపు నిధులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించి పరిపాలనా ఆమోదం తెలియజేస్తూ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జీ.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు పరిధిలో మూడొంతులు ఆయకట్టుకు నీరందించే తూర్పు ప్రధాన కాలువ, కాకర్ల డ్యామ్ నిర్మాణం, పలు మేజర్ కాలువలు, చిన్న, పెద్ద రిజర్వాయర్, అధిక సంఖ్యలో బ్రిడ్జిలు, చప్టాలు ఈ ప్యాకేజీలోనే ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పనులను ఏడు ప్యాకేజీలుగా విభజించి చేస్తున్న విషయం విదితమే. తొలిదశ పనులకు మూడు ప్యాకేజీలు పూర్తిగా, నాల్గవ ప్యాకేజీలో కొంతభాగం ఉన్నాయి. రెండవ దశలో ప్యాకేజీలో మిగిలిన పనులతో పాటు 5, 6, 7 ప్యాకేజీలు ఉన్నాయి. జిల్లాలోని కనిగిరి, గిద్దలూరు, మార్కాపురంలోని కొంతభాగం అలాగే నెల్లూరు, కడప జిల్లాల ఆయకట్టుకు నీరిచ్చే ప్రధాన పనులు అన్ని 4వ ప్యాకేజీలో ఉండగా 2005లో తొలిదశ పనులకు శ్రీకారం చుట్టారు. అందులోభాగంగా ప్యాకేజీ 4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణానికి రూ.39.78 కోట్లు ఇచ్చి పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అనంతరం లింకు కాలువలు, చప్టాలు, బ్రిడ్జిలు, హెడ్ రెగ్యులేటరీల నిర్మాణాలు, ఇతర పనుల కోసం 2005-06లో సుమారు రూ.206.80 కోట్లు, అలాగే 2008-09లో మరో రూ.212.61 కోట్లు వెరసి మొత్తం ఈ ప్యాకేజీ కోసం రూ.482.45 కోట్లకు అనుమతులు ఇచ్చారు. తదనుగుణంగా పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4లో కీలకమైన కాకర్ల డ్యామ్ నిర్మాణం పూర్తయింది. తొలిదశలో ఈ ప్యాకేజీలో 44.62 కి.మీ తూర్పు ప్రధాన కాలువ తవ్వకం చేయాల్సి ఉండగా 99శాతం పూర్తయింది. అలాగే సగం స్ట్రక్చర్ల నిర్మాణాలు పూర్తిచేశారు. రెండవ దశకు సంబంధించి చాలా పనులు చేయాల్సి రాగా ప్యాకేజీ-4 పనులు పూర్తికి గతంలో దాదాపు 15ఏళ్ల క్రితం నాటి ధరల ప్రకారం వేసిన అంచనాలు ఉన్నాయి. పనులలో అధిక భాగం ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో సవరించిన అంచనాల ప్రకారం ప్యాకేజీ మొత్తాన్ని రూ.764.79 కోట్లకు ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రతిపాదనలను పరిశీలించి గతంలో అనుమతులు ఉన్న రూ.482.50 కోట్లు పోను అదనంగా రూ.282.33 కోట్లుకు అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.



ఈత సరదా సరే... ప్రమాదం జరిగితే...

విద్యార్థులు, చిన్నారులకు ఈత సరదా. కానీ అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం ఉన్నా తల్లిదండ్రులు వదిలివేయడంపై విమర్శలు వస్తున్నాయి. అసలే వేసవి కాలం.. పైగా ఎండలు కాస్తున్నాయి. ఈ తరుణంలో అద్దంకి మండలంలోని శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువులో విద్యార్థులు, చిన్నారులు ఈత కొడుతున్నారు. ఇది చూడటానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటు కాడ, తామర ఆకు ఎక్కువగా ఉండటంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకొని లోతైన వాగులు, చెరువులలో పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

రిలయన్స్ బయోగ్యాస్ భూమిపూజకు ఏర్పాట్లు

పీసీపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడు రెవెన్యూ వెంగళాయపల్లి సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తుంది. ఇందుకోసం సర్వేనెంబరు 652లో 475.57 ఎకరాల భూమిని రిలయన్స్ కంపెనీకి ప్రభుత్వం అప్పజెప్పింది. ఏప్రిల్ నెలలో ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. వెంగళాయపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రతిపాదిత స్థలం వరకు మౌలికంగా అవసరమైన రోడ్డు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాటుచేయాలని పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. ఆ మేరకు పంచాయతీరాజ్ డీటీ శ్రీధర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ లక్ష్మీరాజేష్‌లు వెంగళాయపల్లి నుంచి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న భూమి వరకు రోడ్డు వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పరిశీలించారు. ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎక్స్‌కవేటర్‌లతో జంగిల్ క్లియరెన్స్ చేయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్య, వీఆర్వో రసూల్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహాలకు మోక్షమెప్పుడో?

- సామాన్యులకు సొంతింటిని అందించేందుకు 2008లో నిర్మాణాలు ప్రారంభం
- 50 ఎకరాల్లో 598 ఇళ్లకు శ్రీకారం
- ఎన్నో అవాంతరాలతో అప్పుడప్పుడూ నిర్మాణాలు
- 402 ప్లాట్లకు కలగని మోక్షం, 176 ప్లాట్ల విక్రయాలు

వేటపాలెం (చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీడ అనేది కచ్చితంగా ఉండాల్సిన కనీస అవసరం. అయితే దీనిని ఎంచుకునే మార్గాలు మాత్రం వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. అయితే అరకొర ఉపాధి అవకాశాలతో బతుకు బండి లాగేవాళ్లకు కనీసం గంజి నీళ్ల, సొంత చిన్న ఇల్లు జీవితంలో కలగానే మిగులుతుంది. ఈక్రమంలో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు సొంతిల్లును అందిస్తామని, ఇంటి నిర్మాణాలు చేసి ఆక్షన్‌ల ద్వారా ఇల్లు అందిస్తామని ప్రకటించింది. అయితే దీంతో చిగురించిన ఆశలు, రెట్టించిన ఉత్సాహంతో అప్పట్లో ఆక్షన్‌లో పాల్గొనేందుకు మీ-సేవల ద్వారా నామమాత్రపు చెల్లింపును ప్రవేశ పెట్టడంతో అప్పట్లో చీరాల పరిధిలో సుమారు 15 రోజుల పాటు సామాన్య ప్రజలు బారులు తీరారు. పెద్ద ఎత్తున అర్జీలను అందజేశారు.



శిథిలమవుతున్న గృహాలు

బేస్‌మట్టం స్థాయిలోనే నిలిచిన నిర్మాణాలు

అనుకున్నది ఒక్కటి.. అయినది మరొక్కటి

అయితే అప్పట్లో ప్రజలు చీరాల పట్టణానికి సమీపం లేదా ప్రజల నివాసాల మధ్య ఇళ్ల ఏర్పాటు జరుతాయని ఆశాభావంతో అర్జీలకు పోటీ పడ్డారు. కానీ తీరా గృహ నిర్మాణాలు వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం వద్ద జరగడంతో నిరాశతో చాలామంది ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన నగదును వెనక్కి తీసుకున్నారు. ఈక్రమంలోనే అధికారులు నిర్దేశించిన స్థలంపై అనుకూలత లేని ప్రజల్లో చాలా మంది గృహాల ఆక్షన్‌లకు కా వా డా దూరంగా ఉన్నారు. దీంతో అప్పట్లోనే నిర్మాణాలపై ప్రజల్లో భిన్న స్వరాలు వినిపించాయి.

నిర్మాణాలు..ఆక్షన్‌లు ఇలా

అయితే తలపెట్టిన లక్ష్యంతో అధికారులు చల్లారెడ్డిపాలెం పంచాయతీలో సుమారు 50ఎకరాల విస్తీర్ణంలో వివిధ దశల్లో 598 ప్లాట్లు సుమారు రూ.16కోట్ల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఆదిలోనే ఆటంకం ఏర్పడింది. నిర్దేశించిన స్థలంలో సుమారు ఎకరన్నర భూమి కోర్టు పరిధిలోకి చేరింది. అప్పటి నుంచే ప్రారంభమైన వివిధ సమస్యల కారణంగా నిర్మాణాలు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని ప్లాస్టింగ్, పెయింటింగ్ వరకు పూర్తి చేయగా, మరి కొన్ని బేస్‌మట్టంలోనే ఆగిపోయాయి. అయితే 2018లో అప్పటి ప్రభుత్వం జీవె నెంబర్ 243 విడుదల చేసి ఆక్షన్‌లు నిర్వహించాలని ఆదేసించింది. దీంతో ఇప్పటిక నిర్వహించిన మూడు పాటల్లో 176 వరకు అమ్మకాలు జరగ్గా, 400కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తానికి ధర అధికం, స్థలం సుదూరం కావడంతో ప్రజలు వీటికి దూ రంగా ఉంటున్నారు. దీంతో నిర్మాణాలు సాగక లక్ష్యం నీరుగారుతోంది. టీడీపీ కూటమి అయినా దృష్టి సారించి శిథిలమవుతున్న భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్తులను కాపాడడంతోపాటు వాటిని పేదలకు అప్పగించి సొంతింటి కలను నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

అంతర్గత రహదారుల నిర్మాణాలు చేస్తున్నాం



ఇటీవల మంజూరయిన రూ.3.52 కోట్లతో అంతర్గత రహదారులు, నిర్మాణాలు చేస్తున్నాం. గతంలో జరిగిన ఆక్షన్‌ల కారణంగా సుమారు రూ.6 కోట్లు రెవెన్యూ వచ్చింది. మరో రెండు, మూడు నెలల్లో ఆక్షన్‌లు జరుగుతాయి. నిర్మాణాలు పటిష్ఠంగా, పారదర్శకంగా ఉన్నాయి. గృహాలు ప్రజాదరణ పొందుతాయి.

- కోటేశ్వరరావు, రాజీవ్ స్వగృహ అసిస్టెంట్ మేనేజర్



ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు రైతుల సమస్యలను వివరిస్తున్న ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఆలేరు వాగు ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

దగ్గుబాడు (పర్చూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలో ఆలేరు వాగు నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఫార్మర్స్ కమిటీ అధ్యక్షుడు గంటా విజయ్‌కుమార్ కోరారు. గురువారం సంబంధిత రైతులతో కలసి చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడును కలసి సమస్యలు వివరించారు. గజిట్ పబ్లికేషన్ పూర్తై పక్షం రోజులు గడిచిందని, త్వరితగతిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కాలువ నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములను ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కారంచేడు తహసీల్దార్ నాగరాజు, ఇంకొల్లు తహసీల్దార్ వెంకటరత్నం, ఆలేరు వాగు రైతులు గుమ్మడి రామ్మోహన్‌రావు, మార్నేని కృష్ణ, మానం శ్రీనివాస్, నాయుడు సుబ్బారావు, నిమ్మల వేణు, నార్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో అమరరాజా, హెచ్‌డీఎస్ బ్యాంక్, ఐఆర్‌ఎస్‌టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 39 మంది హాజరుకాగా వారిలో 21 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజరేస్‌బాబు తెలిపారు. జాబ్ మేళాలో పొందిన ఉద్యోగాలను యువత సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సంతమాగులూరు మండలంలో పలు కార్యక్రమాలలో హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు గురిజేపల్లి, 10-30 గంటలకు చవిటిపాలెం, 11 గంటలకు సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

వేద పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఆకుమల్ల విశ్వరూపచార్య గురువు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వేద సంస్కృత పాఠశాలలో వి శ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి గురువారం ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 16 సంవత్సరాలలోపు ఉన్న విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వాస్తు జ్యోతిష్యం, పంచాంగ పరిజ్ఞానం, ముహూర్త భాగం, మనుసూత్ర ప్రయోగం, సంస్కృతం, పౌరోహితం తదితర కోర్సులకు మూడు సంవత్సరాల కాల పరిమితిలో ఉచిత భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేసి నేర్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి కలిగిన విద్యార్థులు 9542920400 నెంబరును సంప్రదించి 30వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవాలని కోరారు.

మహిళకు గాయాలు

మార్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వెనుక వస్తున్న వాహనం స్కూటీని ఢీకొట్టడంతో మహిళ గాయపడింది. ఎంఎల్ ఏపీ కంపెనీ క్వార్టర్సులో ఉంటున్న మాధవీలత వ్యక్తిగత పనులు నిమిత్తం కుమారుడితో కలిసి స్కూటీపై చిలకలూరిపేట వెళ్లి వస్తున్నారు. ఇంటూరి ఫంక్షన్ హాలు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాధవీలత రోడ్డుపై పడి గాయపడ్డారు. ఆమెను హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు చెక్కులతో ఉన్న లారీ మీద నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పల్నాడు జిల్లా, చిలకలూరిపేటలోని సంజీవ్ నగర్‌కు చెందిన కొచ్చెర్ల అజయ్ సాగర్ (20) మరో నలుగురు పర్చూరు మండలం పెద్దవారిపాలెంలో బుధవారం కూలి పనికి వచ్చారు. లారీలో పొగాకు చెక్కులు వేసిన అనంతరం లారీ పైభాగంలో కూర్చున్న సాగర్ లారీ కదిలిన సమయంలో కిందపడి గాయపడ్డాడు. క్షతగ్రాత్రున్ని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుమందులపై రైతులకు అవగాహన

ఇంకొల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇంకొల్లు రైతులకు గురువారం పురుగుమందు పిచికారీ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కీటక విభాగపు ప్రొఫెసర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ క్రిమిసహారక మరియు పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు దానికి సం బందించిన బిల్లులు తప్పని సరిగి పొందాలన్నారు.పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది ఇంకొల్లు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యం

మేదరమెట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి, మందులు వాడితే నివారణ సాధ్యమని ఎస్‌టీఎస్ రాజశేఖర్ అన్నారు. గురువారం మేదరమెట్ల జడ్పీ హైస్కూల్‌లో టీబీ లక్షణాలను ఆయన వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు కళ్లెలో రక్తపు చారలు, వాంతులు, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను కలవాలని సూచించారు. మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆర్‌టీపీసీఆర్ సెంటర్‌లో కళ్లె పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారని రాజశేఖర్ తెలపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్‌ఎస్ వెంకటరత్నం, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న ఎస్టీఎస్ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

మోడల్ స్కూళ్లతో విద్యార్థులకు భవిష్యత్

అద్దంకిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందని ఇది విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరమని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఎంఈవో-2 బూదాటి సుధాకరరావుతో కలిసి మండలంలోని పలు పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మన్‌లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఏఏ గ్రామాలలోని పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మారుస్తున్నారు, ఏఏ గ్రామాలలో అందుకు అంగీకరించలేదు అనే విషయాలను విద్యాశాఖ అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పక్క, కాలనీలోనే బడి ఉండాలనే ఉద్దేశంతో ఎవరూ మాట్లాడవద్దని ప్రభుత్వం 1 నుంచి 5 తరగతి వరకు ఒక చోట పెట్టి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఏర్పాటు చేసి మోడల్ స్కూల్‌గా మారుస్తుందన్నారు. మోడల్ స్కూల్ ఉపయోగాలపై స్కూల్ కమిటీ చైర్మన్‌లు అవగాహన కలిగి అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పలు పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

రమణాయపాలెంలో ఎత్తిపోతల పరిశీలన

రమణాయపాలెం (పర్చూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రమణాయపాలెంలోని ఎత్తిపోతల పథకాన్ని విశ్రాంత ఇంజనీరింగ్ అధికారి సత్యనారాయణ రైతులు, టీడీపీ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయా పథకాల పనితీరు, మరమ్మతులు తదితన అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేసి అందించేవిధంగా ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా విశ్రాంతి డీఈ నేతృత్వంలో ఆయా పథకాలను పరిశీలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రమణాయపాలెం ఎత్తిపోతలను పరిశీలించినట్లు వారు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనేవారికి రిజర్వేషన్‌లు

వేటపాలెం(చీరాల), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తమంగా రాణిస్తే వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యాన్ని అమలు చేస్తారని కెప్టెన్ చైతన్య, శిక్షకులు కర్ణ నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శేఖరరావు ఆధ్వర్యంలో వివిధ తరగతులకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులకు స్కౌట్స్, అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానోపధ్యాయుడు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గనడం వలన దేశభక్తి, సామాజిక దృక్పథ, వ్యక్తులపై గౌవరం పెరుగుతుందని, విద్యార్థులతో సంబంధిత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది అన్నమనేని రామస్వామి మృతి

పలువురి నివాళి



అన్నమనేని రామస్వామి


అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీనియర్ న్యాయవాది అన్నమనేని రామస్వామి (90) వయోభారంతో హైదరాబాద్‌లో బుధవారం రాత్రి మృతి చెందారు. రామస్వామి మృతదేహాన్ని గురువారం అద్దంకి తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రామస్వామి చీమకుర్తి మండలం పల్లామల్లిలో 1935 జులై1నలో వీరయ్య, రంగమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యను పల్లామల్లి, హైస్కూల్ విద్యను ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్, డిగ్రీ గుంటూరు ఏసీ కళాశాలలో పూర్తి చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. బార్ కౌన్సిల్‌లో 1961లో సభ్యత్వం పొందారు. అనంతరం ఒంగోలులోని కరవది వెంకటేశ్వర్లు వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1983 వరకు ఒంగోలు కోర్టులో న్యాయవాదిగా పనిచేసి అనంతరం అద్దంకి కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 9 పదుల వయస్సులోనూ ఇటీవల వరకు కోర్టుకు వెళ్లి కేసులు వాదించారు. రామస్వామికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మేదరమెట్ల రోడ్డులోని వెంకటస్వామి టవర్స్‌లో రామస్వామి మృతదేహం వద్ద పలువురు న్యాయవాదులు, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం సాయం త్రం అద్దంకిలోని నర్రావారిపాలెం శ్మశానవాటికలో అంతిమ సంస్కారం నిర్వహించారు.

ఓటర్ కార్డ్‌కు ఆధార్‌ను లింక్ చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటరుకు ఆధార్ నెంబర్ లింకు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను విచారణ చేసి సంబంధిత రిపోర్టును తహసీల్దారు కార్యాలయానికి పంపించాలని తహసీల్దారు కే రవికుమార్ అన్నారు. గురువారం యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో తహసీల్దారు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో బీఎల్‌వోలకు ఆయన పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు విష్ణుప్రసాద్, సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ టి భాస్కరరావు, పలువురు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్



మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కార్డులను అందజేస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో వేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకార సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నట్లు నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు అందించే డీజిల్ సబ్సిడీ కార్డులను స్వయంగా అందజేశారు. ఈసందర్భంగా స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పోర్టు నిర్మాణం, టూరిజం వంటి వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. అలాగే నిషేధ కాలంలో భత్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీలో వసతుల పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతికుమారి

అద్దంకి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ముంపు గ్రామమైన ధేనువకొండ పునరావాసకాలనీలలో ఒకటైన దక్షిణ ధేనువకొండ పునరావాస కాలనీని గురువారం గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) పరిశీలించారు. పునరావాస కాలనీలో ప్రస్తుతం ఉన్న వసతులు, కల్పించాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇంకా ఇళ్ల స్థలాల కేటాయింపు జరగని కుటుంబాలు, శ్మశానవాటిక సమస్య, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను గ్రామస్థులను వివరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరి, టీడీపీ నేతలు జొన్నలగడ్డ కృష్ణ, నలజల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ ఆంజనేయులు, చ క్రవరం అంజనరాజు, అన్నాబత్తిన హనుమంతరావు, కొండలు, జొన్నలగడ్డ పేరయ్య, గుంజి గోవింద్ పాల్గొన్నారు.

గొనసపూడిలో శనగల కొనుగోలు కేంద్రం

చినగంజాం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామంలోని చింతగుంపల్లె పీఏసీఎస్‌లో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి కే.భాస్కరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌లో మండల పరిధిలో వేసిన శనగ పంట కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేజే11 రకం శనగ పంట మద్దతు ధర క్వింటా రూ.5,650గా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శనగ పంట సాగు చేస్తున్న రైతులు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకొని శనగ పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు.

నేడు గురు చెన్నాదాసు ఆరాధనోత్సవం

సంతమాగులూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరులోని శ్రీ ఆవుల మంద గురు చెన్నా దాసు 134వ ఆరాధన మహోత్సవం జరుగుతుందని చెన్నా దాసు గ్రామ కమిటీ నాయకులు ఆవుల మంద ఓంకార్, చెన్నా దాస్ తెలిపారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సీఎంకు డక్కలి కులస్థుల కృతజ్ఞతలు



మోదీ, చంద్రబాబు, కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డక్కలి కులస్థులు

మార్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : డక్కలి కులస్థులను గుర్తించి, వారిని ఎస్సీ వర్గీకరణలో చేర్చినందులకు కూటమి ప్రభుత్వానికి మార్టూరులోని ఆదిజాంబవంతుకాలనీలోని డక్కలి కులస్థులు గురువారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఒ క ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోకాలంగా గుర్తింపునకు నోచుకోకుండా ఆదరణ కోసం నాయకులచుట్టూ తిరుగుతున్న డక్కలి కులస్థులకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకాన్ని చేశారు. కార్యక్రమంలో డక్కలి సంఘ నాయకులు నాయకులు బాబు, యల్లమంద, సాయిబాబు, టీడీపీ నాయకులు కాకోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉల్లాస్ సాక్షరతా కార్యక్రమంపై అవగాహన



మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు మనోరంజన్

పర్చూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వయోజన విద్యాశాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమంపై వెలుగు కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్యాశాఖ పర్యవేక్షకుడు కొణిదల మనోరంజన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువురాని వయోజనులకు (15, అంతకంటే ఎక్కువ వయస్సు) గల వారికి పనుల్లో ఉపయోగపడేలా చదవడం, రాయడం, లెక్కలు చేసుకోవటం నేర్పటమే ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయ బృందాలలో మొదటి విడతగా చదువురాని 590 మంది మహిళలను గుర్తించి వారికి, వారి బృందాలలోనే చదువుకున్న మహిళలతోనే చదువు నేర్పించడం జరిగిందన్నారు. వయోజన విద్య ద్వారా అక్షరాశ్యత సాధించిన వారికి ఎన్‌ఐవోఎస్ ద్వారా ధ్రువీకరణ పత్రాలను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కొండి రామకృష్ణ, సీసీలు, వివిధ గ్రామాల యానిమేటర్లు, టీచర్స్ పాల్గొన్నారు.

కారంచేడు : కారంచేడు వెలుగు కార్యాలయంలో ఉల్లాస్‌పై ఏపీఎం టి.మోహన్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సంగీతం.. కళే కాదు.. అది సంస్కృతీ, సంప్రదాయాలను నేర్పుతుంది. అవసరానికి ఉపాధిగా ఉంటుంది. అందుకే అందరూ సంగీతం నేర్చుకోవాలి.' అని ప్రముఖ గాయని, పద్మవిభూషణ్, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సోదరి ఎస్పీ శైలజ అన్నారు. నెల్లూరులో జరుగుతున్న 60వ త్యాగరాజస్వామి స్వర్ణోత్సవాల కోసం విచ్చేసిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

సంగీతం అందరూ నేర్చుకోవాలి

సంప్రదాయాలు నేర్పడమే కాదు.. ఉపాధినీ ఇస్తుంది!

నాన్న, అన్న ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయికి..

'ఆంధ్రజ్యోతి'తో ప్రముఖ గాయని ఎస్పీ శైలజ

ఇంటర్వ్యూ



? త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వహణ ఎలా ఉంది

! నెల్లూరులో త్యాగరాజ స్మరణోత్సవాలు అజరామరం. 60 సంవత్సరాల క్రితం మా నాన్న పండితారాధ్యుల సాంబమూర్తి, ఆయన మిత్రులు భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఏర్పాటు చేసి ఆయన ఆరాధన ఉత్సవాలు జరుపుకున్నారు. ఆ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది.

? ఇంత ఆదరణ ఎలా వచ్చింది.

! నగరంలో సంగీతం, ఇతర కళలు నేర్చుకున్న కళాకారులతోపాటు ఆరాధకులు, పోషకులు ఉన్నారు. అలాగే మా నాన్న హయాం నుంచి భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభకు క్రమశిక్షణ, ధర్మబద్ధత కలిగిన కార్యవర్గం ఉంది. మా నాన్న, ఆయన మిత్ర బృందం ఆశయం కొనసాగిస్తూ ఈ సంగీత మహా యజ్ఞం చేస్తున్నారు.

? ఈ కార్యక్రమాలకు మీ అనుబంధం

! త్యాగరాజ స్మరణోత్సవాలు మా తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి మిత్రబృందం కొనసాగించింది. ఆయన అనంతరం మా అన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. ఇప్పుడు ఆయన కుమారుడు చరణ్ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్, మిత్ర బృందం కొనసాగిస్తున్నారు. ఇది ఇలాగే ఎంతో వైభవంగా సాగుతుంది.

? మీ ఇంటిలో వేద తరగతులు జరుగుతున్నాయా

! మా అన్నగారు హయాంలో నగరంలోని మా ఇంటిని కంచి పీఠానికి అందజేశాము. అయితే, ఆ ఇంట్లో డ్రైనేజీ సమస్య ఏర్పడటంతో కొద్దిరోజులు కంచిపీఠం వేద తరగతులు నిర్వహించలేదు. ఇప్పుడు రిపేర్లు పూర్తవడంతో తరగతులు జరుగుతున్నాయి.

? నెల్లూరుకు వస్తే మీకేం అనిపిస్తుంది.

! నా బాల్యస్మృతులు జ్ఞాప్తికి వస్తాయి. నా స్నేహితులు, బంధువులు ఆప్యాయంగా పలకరింపులు ఆనందాన్ని ఇస్తాయి. అన్న బాలసుబ్రహ్మణ్యం లేనిలోటు కనిపిస్తోంది. సంగీత ప్రపంచంలో ఆయన స్థానాన్ని సాధించేవారు మా కుటుంబంలో చరణ్‌కే ఉంది. కష్టపడుతున్నారు. అభిషేక్ (చిన్న కుమారుడు) కూడా సంగీతం, పాటలు పాడుతున్నాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ వద్ద పని చేస్తున్నారు.

? సినీ గాయనిగా కొనసాగుతున్నారా

! లేదండీ. సినిమా పాటలు పాడటం మానేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో సంగీత కచేరీలు చేస్తున్నాను. వీటితోపాటు టీవీ ప్రోగ్రామ్‌లు కూడా చేస్తున్నాను. నాడు మా తండ్రి, అన్న ప్రోత్సాహమే నన్ను సంగీత విద్వాంసురాలిని చేశాయి. ప్రతి ఒక్కరూ సంగీతం నేర్చుకోవాలి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



ఓ బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు

కావలిలో జీఎస్టీ అధికారుల దాడులు

- ఆరు దుకాణాల్లో రికార్డుల పరిశీలన
- బిల్లులు లేకుండా 10 కిలోల బంగారం గుర్తింపు
- మిగిలిన అంగళ్లు మూత

కావలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కావలిలోని బంగారు దుకాణాలపై గురువారం ఉదయం జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. దుకాణాలు తెరిచే సమయానికి గుంటూరు నుంచి జీఎస్టీ అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్లు నాగరాజు, రవికుమార్‌ల ఆధ్వర్యంలో సుమారు 20 మంది అధికారులు, సిబ్బంది 4 కార్లలో బీబీజీ బజారు వద్ద వాలిపోయారు. ముందస్తు సమాచారం మేరకు ఎంచుకున్న ఆరు దుకాణాలలోకి ఒకేసారి ప్రవేశించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న మిగిలిన వ్యాపారులంతా దుకాణాలకు తాళాలు వేసి రోడ్లపై ఉండిపోయారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు రికార్డులు, బంగారు నిల్వలను అధికార బృందం పరిశీలించింది. ఎంత బంగారం కొనుగోళ్లు చేశారు.. స్టాక్ పుస్తకాలు, క్రయ, విక్రయాల పుస్తకాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 6 దుకాణా లలో సుమారు 10 కేజీల బంగారం అదనంగా ఉందని గుర్తించి వాటికి టాక్స్‌లు విధించినట్లు తెలిసింది. దాడులకు సంబంధించిన వివరాలను తెలిపేందుకు జీఎస్టీఅండ్ కస్టమ్స్ అధికారులు నిరాకరించారు.

కార్పొరేషన్ పద్దు రూ.695.95 కోట్లు

నెల్లూరు (సిటీ), మార్చి20, (ఆంధ్రజ్యోతి) : భారీ బడ్జెట్ తో నగరపాలక సంస్థ సిద్ధమైంది. ఆదాయం, ఖర్చులను లెక్కకట్టి భారీ పద్దును ఈ నెల 26వ తేదీన కౌన్సిల్ సమా వేశంలో ప్రవేశపెట్టేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రూ.695.95 కోట్లతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని కార్పొరేషన్ అధికారులు దాదాపుగా పొద్దు సిద్ధం చేశారు. మేయర్ స్రవంతి నేతృత్వంలోని కౌన్సిల్ సమావేశంలో ఈ పొద్దును సభ్యుల ముందుకు తీసుకు రానున్నారు. గతేడాది ప్రారంభ నిల్వ రూ.121.30 కోట్లు కలుపుకుని రానున్న ఏడాది ఆదాయంగా రూ. 585.48 కోట్లుగా లెక్కకట్టిన అధికారులు మొత్తంగా రూ. 706.79 కోట్లుగా చూపనున్నారు. కాగ అందులో అన్ని రంగాలకు పెట్టే ఖర్చు రూ. 695.95 కోట్లుగా ఉంటుందని యంత్రాంగం భావిస్తోంది. ఈ మేరకు బడ్జెట్‌కు తదు పరి తుది మెరుగులు దిద్దుతున్న అధికారులు 26వ తేదీన పై మొత్తాన్ని అధికారికంగా కౌన్సిల్లో విడుదల చేయనున్నారు. ప్రతి ఏడాదిలో ఆదాయ వనరులను పెంచుకుంటూ వెళ్తున్న కార్పొ రేషన్ అధికారులు అవి ఖజానా దాక రావడం లేదన్న ప్రధా న విమర్శను మూటకట్టుకుంటున్నారు. అనేక మార్గాల ద్వారా ఆదాయం ఎన్‌ఎంసీకి ఉన్నప్పటికీ వాటిని కాగితాల్లో చూపి చేతులు దులుపుకుంటున్నారు. పైగా బడ్జెట్‌లో ఖర్చు చేస్తున్నట్లు చూపుతన్న లెక్కల్లోనూ స్పష్టత కరువవుతోంది. సీసీ రోడ్లు, డ్రైన్లు, సుందరీకరణ, చెత్త తరలింపులకు మినహాయిస్తే మిగిలిన రంగాలకు చూపుతున్న ఖర్చుల్లో వాస్తవం దూరంగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈసారైనా అధికారులు ఆదాయం, ఖర్చుల పై చిత్త శుద్ధితో వ్యవహరించాలని నగర వాసులు కోరుతున్నారు.



తెప్పపై దేవేరులతో కలిసి విహరిస్తున్న రంగనాథుడు

తెప్పపై రంగడి విహారం

పండు వెన్నెల కాంతి.. అశేష భక్తజనం నడుమ తల్పగిరి రంగనాథుడు తన దేవేరులతో కలిసి గురువారం రాత్రి తెప్పపై విహరించారు. ఈ ఉత్సవంతో ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ముగిసినట్టు అయ్యింది. కాగా, రంగనాథ స్వామి ఆలయం నుంచి పెన్నా బ్యారేజీ వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. విశేష పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు కనువిందు చేశారు. ఆలయం నుంచి ఉత్సవర్లను ఊరేగింపుగా తీసుకువచ్చి తెప్పపై కొలువదీర్చారు. మంగళవాయిద్యాలు, మిరుమిట్లు గొలుపే బాణాసంచా పేలుళ్ల మధ్య తెప్పోత్సవం జరిగింది. వేద మంత్రాలు, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, సర్వదేవతా ఆరాధనా పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

నీరు-చెట్టు... బిల్లుల లోగుట్టు!

- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- నాడు చేయని పనులు చేసినట్లుగా చూపే కుట్ర
- ఆరేళ్ల క్రితం వర్కులకు ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు
- ఇరిగేషన్‌లో బరితెగిస్తున్న అక్రమార్కులు
- లెక్కా పక్కా లేకుండా వస్తూనే ఉన్న బిల్లులు

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత లక్ష్యానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వం తలస్తే.. ఆ మాటున అడ్డదారిలో ప్రజాధనాన్ని దోచుకునేందుకు ప్రయత్ని స్తున్నారు. సందట్లో సడే మియాలా నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులో దొంగ బిల్లులు పెట్టేం దుకు కుట్రలు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్లు, రాజకీయ నేతలు ఇందుకు సూత్రధారులు కాగా కొందరు ఇరిగేషన్ అధికారులు వీరికి సహకరిస్తు న్నారు. 2014-19 మధ్యలో మంజూరైన వర్కులకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు ఇప్పుడు మంజూరు చేస్తుండటం గమ నార్హం. ఈ సర్టిఫి కెట్ల ఆధారంగా బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఈ బిల్లుల్లో నీకు సగం - నాకు సగం అన్న ఫార్ములాతో అక్ర మార్కులు పావులు కదుపు తున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకం పేరుతో జిల్లాలో సుమారు రూ.700 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టారు. దాదాపుగా అన్ని వర్కులూ రూ.10 లక్షల్లోపు ఉండడంతో వాటిని నామినేషన్ కింద అప్పగించారు. 2016-17, 2017-18 సంవత్సరాల్లో చేసిన పనులకు అప్పట్లోనే బిల్లులు వచ్చేశాయి. అయితే 2018-19 ఏడాది కాలంలో వేల వర్కులను మంజూరు చేయగా వాటిలో కొన్నింటిని పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో మరికొన్ని వర్కులు మొదలుకాలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నీరు-చెట్టు బిల్లులను ఆపేసింది. చివరకు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించి బిల్లులు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఇలా చాలా వరకూ బిల్లులు మంజూరు కాగా మరికొన్ని కోర్టులో పెండింగ్ ఉన్నాయి. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ బిల్లులన్నీ వేగంగా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇరిగేషన్ అధికారులు ఆ ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే దీనిని కొందరు అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. 2017-19 మధ్య కాలంలో నామినేషన్ మీద పనులు తీసుకొని, ఆ తర్వాత పనులు చేయని వ్యక్తులు కూడా ఇప్పుడు బిల్లులు పొందేందుకు కుట్రలు చేస్తున్నారు. అప్పట్లో అగ్రిమెంట్ ఉంది కాబట్టి పనులు చేసినట్లుగా ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంబుక్‌లు పాత తేదీలతో రికార్డు చేసినా క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు మాత్రం పాత తేదీలతో ఇవ్వడం కుదరదు. కాబట్టి ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
Quality Control Certificate

2018లో అగ్రిమెంట్ అయిన ఓ వర్కుకు 2023లో ఇచ్చిన క్యూసీ సర్టిఫికెట్

● నాలుగేళ్ల తర్వాత క్యూసీ సర్టిఫికెట్లు

నిబంధనల ప్రకారం ఒక వర్కు పూర్తయిన వెంటనే క్యూసీ సర్టిఫికెట్ ఇవ్వాలి. అందులోనూ నీరు-చెట్టు వర్కులన్నీ రూ.10 లక్షల్లోపు ఉన్నవే కాబట్టి క్యూసీ అధికారుల వెరిఫికేషన్‌కు ఒక రోజుకు మించి సమయం పట్టదు. అలాకాకుండా ఎప్పుడో 2017-18, 2018-19 సంవత్సరాల్లో అగ్రిమెంట్లు చేసుకున్న వర్కులకు 2023, 2022 సంవత్సరాల్లో క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇటువంటి సర్టిఫికెట్లు కొన్ని 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కాయి. 2019 ఎన్నికల తర్వాత పనులే జరగకపోతే మూడు, నాలుగేళ్ల తర్వాత క్యూసీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారన్నదే ప్రశ్నగా మారింది. ఈ సర్టిఫికెట్ల జారీ బాగోతం ఇంకా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఏ పనిని వెరిఫికేషన్ చేసి సర్టిఫికెట్లు ఇస్తున్నారో క్యూసీ అధికారులే సమాధానం చెప్పాలి. నాడు కూడా ఇరిగేషన్ అధికారులు పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ కోర్టుకు వేసి బిల్లులు తెచ్చుకోవాలన్న ప్రయత్నాల్లో ఉండగా, ఇంతలో ప్రభుత్వమే బిల్లుల చెల్లింపునకు నిర్ణయం తీసుకోవడంతో అక్రమార్కుల పంట పండినట్లు చెప్పుకుంటున్నారు. వీరి బాటలోనే ఇప్పుడు మరికొంత మంది అక్రమార్కులు దొంగ బిల్లులు పెట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అటవీ పనుల ధర 4.36శాతం పెంపు

ఎఫ్ఎస్ఆర్ జోనల్ కమిటీ చైర్మన్ రాజు

- వివరాలు 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం)

సహరి : 4.57 (శనివారం ఉదయం)

47 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

- నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ ముందస్తు చర్యలు
- రూ.2.14 కోట్ల ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో ఇప్పటివరకు నీటి ఎద్దడి ఏర్పడలేదు. అయితే, ఎండలు ఎక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయగిరి, వింజమూరు, కందుకూరు, కొండాపురం మండలాల్లో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతూ ఉంటుంది. దీంతో ఆయా మండలాల్లోని 47 గ్రామాలను అధికారులు గుర్తించారు. ట్యాంకర్ల ఏర్పాటు, పైపులైన్ మరమ్మతు తదితర వాటికి సంబంధించి రూ.2.14 కోట్లు అవసరం ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్ ఆనంద్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అధికారులు నీటి సరఫరా చేసేందుకు వెసులుబాటు లభించింది.

దిగుబడి లేదాయె.. ధర పలకదాయె!

- శనగ సాగుదారుల్లో దిగాలు
- ఎకరాకు 2 క్వింటాళ్లూ అనుమానమే
- గోదాముల్లో నిల్వ చేసిన రైతుల్లోనూ ఆందోళన

శనగ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వాతావరణం అనుకూలించక ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోగా సాగుచేసిన శనగ పైరు కూడా బెట్టకొచ్చేసింది. దీంతో కనీస దిగుబడులు కూడా వచ్చే అవకాశం లేదని అసలు కోతకూలి ఖర్చులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు గత మూడు నెలలుగా శనగ ధరలు తగ్గుతూ వచ్చి నెలరోజులుగా పూర్తిగా ధర పతనం కావటంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు రెండు, మూడేళ్లుగా రెండు, మూడేళ్లుగా ఏసీలలో నిల్వచేసి ఉన్న రైతులు దారుణంగా పతనమైన ధరతో దిక్కుతోచని స్థితిని అనుభవిస్తున్నారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాలుగా కందుకూరు డివిజన్‌లో విస్తారంగా శనగ సాగు చేస్తున్నారు. నియోజక వర్గంలోనే ప్రతిఏటా సరాసరిన పదివేల ఎకరాలలో శనగ సాగయ్యేది. అలాంటిది ఈ సంవత్సరం కేవలం పదోవంతు అంటే వెయ్యి ఎకరాలలో మాత్రమే శనగ సాగవగా దిగుబడి సరాసరిన 2 క్వింటాళ్లకు మించే పరిస్థితి లేదు. దీంతో కోత, నూర్పిడి ఖర్చులు కూడా రావని భావించిన రైతులు వదిలేయటానికి సిద్ధపడుతున్నారు. నవంబరు, డిసెంబరు మాసాలలో ఎడతెరపి లేని వర్షాలు కురవటంతో అదనులో శనగ సాగుచేయలేక పోయారు. జనవరి ద్వితీయార్థం వరకు భూములు ఆరుదలకు రాకపోవటంతో అప్పుడు శనగ వేశారు. అదను దాటాక శనగ వేయటం దండగని ఎక్కువశాతం మంది రైతులు పొగాకు వైపు మొగ్గుచూపారు. దీంతో కేవలం వెయ్యి ఎకరాలలోనే శనగ సాగవగా పైరు పెరుగుదల, పూత పిందే దశలో బెట్టకు రావటంతో దిగుబడి లేకుండా పోయింది.



కందుకూరు ప్రాంతంలో గిడసబారి పూత, పిందె లేకుండా పోయిన శనగ పైరు

● భారీగా పతనమైన ధరలు

గత సంవత్సరం కాగ్-2 రకం శనగలు క్వింటం రూ.12,600 వరకు ధర పలికింది. అయితే, పంట రైతుచేతికొచ్చేకొద్దీ ధరను దిగజారుస్తూ వచ్చిన వ్యాపారులు రూ.8500లకు తెచ్చారు. దీంతో రైతులంతా కోల్డ్‌స్టోరేజీ లలో దిగుబడులను నిల్వచేశారు. అయితే సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో శనగల ధరల్లో కదలికవచ్చి క్వింటం రూ.10500లకు చేరినా కొద్దిశాతం మంది మాత్రమే విక్రయించారు. అక్టోబరు తర్వాత మళ్లీ పతనమవుతూ వచ్చిన శనగల ధర ప్రస్తుతం కాగ్ 2 రకం క్వింటాల్ రూ.7200 పలుకుతుండగా దేశీరకం శనగలు క్వింటాల్ రూ. 5800 మాత్రమే ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. ఏసీ బాడుగలు, వడ్డీలు చూసుకుంటే క్వింటం రూ.12వేలకు అమ్మినా పెట్టుబడులే కళ్లజూడగలుగుతామని అప్పుల పాలవుతామని వాపోతున్నారు. ఈ స్థితిలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుని కోల్డ్ స్టోరేజీలలో ఉన్న పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొండాపురం : మండల పరిధిలోని సాయిపేట, నేకునాంపేట, మర్రిగుంట, వెలిగండ్ల, ఉప్పలూరు, పార్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు శనగను అధికంగా సాగు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో శనగ సాగుకు దుక్కికి రూ.10 వేలు, విత్తనాలు, పురుగు మందులు, కలుపుతీత, కోత, నూర్పిడి తదితర పనులకు రూ.20 వేల వరకు ఖర్చు అయిందని రైతులు అంటున్నారు. కౌలు భూమి అయితే అదనంగా రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. స్ప్రింక్లర్స్ ద్వారా నీటిని అందించడంతో మరో రూ.5వేల నుంచి 6 వేల వరకు ఖర్చయ్యింది. ఖర్చులన్నీ కలిపి సొంత భూమి కలిగిన రైతులకు ఎకరానికి రూ.35 వేలు, కౌలు భూమి చేసిన రైతులకు ఎకరానికి రూ.45-50 వేల వరకు ఖర్చు అయింది. ఇంత భారీ పెట్టుబడులు పెట్టి పంటను పండించిన రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దిగుబడులు తగ్గడంతోపాటు మద్దతు ధర తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. బయట మార్కెట్లో కాక్-2 (ఎర్ర శనగలు) క్వింటా రూ.5500, జేజే (తెల్లశనగలు) క్వింటం రూ.6500 వరకు కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోల్చితే ఇప్పటి ధర తక్కువగా ఉందని రైతులు అంటున్నారు. మద్దతు ధరను పెంచి ప్రభుత్వమే శనగలు కొనుగోలు చేసి, ఆదుకోవాలని శనగ సాగుచేసిన రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.35వేల వరకు ఖర్చు



కొండాపురం : శనగ పైరును మిల్లర్‌లో వేస్తున్న కూలీలు

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100) : 425


అంగన్‌వాడీ పిల్లలతో జిల్లా హ్యూమన్ రైట్స్ చీఫ్ సునీల్ తదితరులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం రామస్వామిపాలెం లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా హ్యూమన్ రైట్స్ చీఫ్ దాసరి సునీల్ గురువారం తనిఖీ చేశారు. పిల్లల పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి భద్రత పాటిస్తున్నారని పరిశీలించారు. తదుపరి పిల్లలకు పౌష్టికాహారాన్న పంచిపెట్టారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ బత్తుల రవిచంద్ర, ఓఆర్‌జీ సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సదరన్' పరిశీలనలో అవస్థలు

- వసతులు లేక ఇబ్బందులు పడిన దివ్యాంగులు

కావలి, మార్చి20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు గతంలో ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్ల పరిశీలనను ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం గురువారం ఏరియా వైద్యశాలకు వచ్చిన దివ్యాంగులకు సరైన వస తులు లేక అవస్థలు పడ్డారు. దూరప్రాంతాల నుంచి ఏరియా వైద్యశాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో వచ్చిన దివ్యాంగులకు స ర్టిఫికెట్ పరిశీలన ఎంత సమయం పడుతుందో.. ఈ రోజు అవు తుందో... లేదో...? తెలియక ఇబ్బందులు ఎదుర్కొన్నారు, కూర్చునేం దుకు వసతి లేక అక్కడ నుంచి డాక్టర్ దగ్గరకు వెళ్లేందుకు వీల్ చైర్లు లేక ఇబ్బందులు పడ్డారు. వయసు మీరిన తల్లిదండ్రులు దివ్యాంగులైన వారి పిల్లలను ఎత్తుకుని లోపలకు తీసుకుని వెళ్లలే క ఇబ్బందులు పడ్డారు. రోజుకు 50 మందికి మాత్రమే పరిశీలన చేసేందుకు సమయం వైద్యులకు సరిపోతుండగా, గురువారం 75 మంది దివ్యాంగులు వచ్చారు. వీరు తమ పేర్లు నమోదు కోసం ఆత్రుత పడుతున్నారు. వేసవి కావటంతో అక్కడ నీటి వసతి సరిగా లేక అన్నం అందుబాటులో లేక దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- వసతులు సమకూర్చాలి

దివ్యాంగులకు వసతులు సమకూర్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగులకు రవాణా సదుపాయంతో పాటు, మంచినీరు, బోజనం సదుపాయం కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు మరుసటి రోజుకు వాయిదా వేయకుండా వచ్చిన రోజునే పరిశీ లన పూర్తి చేయాలి.

-మండవ వెంకట్రావు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు



సదరన్ సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన దివ్యాంగులు, దివ్యాంగుడిని ఎత్తుకుని వస్తున్న సహాయకుడు

ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాలి : కావలి ఎమ్మెల్యే



కావలి, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చినా, సాగునీటి ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ చేపట్టలేదని కావ లి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. అసెంబ్లీలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు స్థిరీకరణ చేపట్టి రైతులకు న్యాయం జరిగేట్లు చూడాలన్నారు. రాజధాని ప్రాంతం కూడా వ్యవసాయేతర భూములుగా మారినా ఇరిగేషన్ రికార్డుల్లో ఇంకా వ్యవసాయ భూమిగా చూపుతున్నారన్నారు. మంత్రి నారాయణ ఆసుపత్రి వందలాది ఎకరాల్లో ఉన్నా, ఇంకా అది కూడా నీటి పారుదల ఆయకట్టు కింద చూపిస్తున్నారన్నారు. ఇపక్పటికైనా రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు కమిటీగా ఏర్పడి నూతన ఆయకట్టును స్థిరీకరించాలని కోరారు. ఇందుకు ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించారు.

న్యూస్ బాక్స్

23న చలో తిరుపతి

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంత మాలసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న చలో తిరుపతి నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మాలలు పెద్దసంఖ్యలో తరలిరావాలని మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి రాష్ట్రాల మాజీ ప్రధాన కార్యదర్శి పాలేటి కోటేశ్వరరావు, మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు బొట్లగుంట శ్రీనివాసులు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అన్నీ రాజకీయ పార్టీలు మాలలపై కత్తికట్టాయని, విషయ పరిజ్ఞానం లేని వ్యక్తులతో కమిషన్‌లు వేసి తప్పుల తడక రిపోర్టులతో ఎస్సీ రిజర్వేషన్లను విభజించటం ద్వారా మాలలకు తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నం జరుగుతున్నదన్నారు. దీన్ని మాలలంతా సంఘటితంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తిరుపతిలో జరిగే బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

ఉలవపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు మెరైన్ సీఐ జీ శివన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 27 గ్రామాల నుంచి జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.15,000, రెండో బహుమతిగా రూ.12,000, మూడవ బహుమతిగా రూ.8,000, నాల్గవ బహుమతిగా రూ.5,000 నగదుతో పాటు షీల్డ్‌లు ప్రదానం చేస్తామన్నారు. మెరైన్ డీఐజీ గోపీనాథ్ శెట్టి, అడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదన్‌రావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ కబడ్డీ పోటీల రెఫరీగా శ్రీనివాసరావు



ఉలవపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామానికి చెందిన సాదం శ్రీనివాసరావు జాతీయ కబడ్డీ టోర్నమెంట్ రెఫరీగా ఎంపిక అయ్యారు. ఆయన ఎంపికపై మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఓ. శ్రీనివాసులు, పీ. శ్రీనివాసులు, ఎస్.వెంకట్రావు, కే. ప్రభాకర్, జీ. ప్రభాకర్, ఎం మోహనరావు, కబడ్డీ కోచ్ శివ సిసింద్రీ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 27 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే జాతీయ కబడ్డీ పోటీలకు రెఫరీగా శ్రీనివాసరావుని ఎంపిక చేశారు. ఇందుకుగాను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వీ రవీంద్రబాబుకు, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎలమంచి శ్రీకాంత్‌కు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వాయిల శ్రీనుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్ఐ బదిలీ

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ మహబూబ్ సుభానీని ఎస్పీ బదిలీ చేశారు. ఆయన్ను వీఆర్‌కు పిలిపించినట్టు సిబ్బంది ద్వారా తెలిసింది.దీంతో గురువారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయి వెళ్లి పోయారు. 8 నెలలపాటు ఇక్కడ విధులు నిర్వహించారు.

చేతిపంపును బాగు చేయరూ...?

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రామస్వామిపాలెం శ్మశానవాటిక వద్ద ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంత్యక్రియలకు వచ్చే వారు నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. పాడైపోయి నెల కావస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనికితోడు ముళ్లచెట్లు పెరిగిపోయినట్లు స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దళిత, గిరిజనవాసులకు శ్మశానం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రామస్వామిపాలెం శ్మశాన వాటిక వద్ద పనిచేయని చేతిపంపు

అదనపు నిధుల మంజూరుకు చర్యలు చేపట్టండి


మాట్లాడుతున్న మధుసూదనరావు

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అదనపు ఆర్థిక చేయూత పథకం కింద నిధుల మంజూరుకు ఎంపికైన పక్కా గృహాల నిర్మాణాల లబ్ధిదారులకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కందుకూరు గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎస్ మధుసూదనరావు సిబ్బందిని ఆదేశించారు.గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ మండలంలో ఈ పథకం కింద ఎంపికైన ఎస్సీలు 1230 మందికి, బీసీలు 677 మందికి ఒక్కొక్కరికి రూ.50 వేలు, ఎస్టీలు ఒక్కొక్కరికి రూ.75 వేలు ఇస్తారని చెప్పారు.పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది నిర్మల, యాస్మి న్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శారీరక దారుఢ్యం ఎంతో అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని ఎంపీడీవో చేవూరు శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి శారీరక, మానసిక దారుఢ్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ నిజాం ఆసుపత్రి వైద్యులు రమేష్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు ఫిజికల్‌గా ఫిట్‌నెస్‌తో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పని ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్ వాడకంతో కలిగే లాభనష్టాలను వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సంధ్యా లక్ష్మి, ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ఇతరశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో మ్యాగజైన్ విడుదల


కళాశాల మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న ఏవో ఆర్వీ రమణారెడ్డి, తదితరులు

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం సంహిత పేరుతో కళాశాల మ్యాగజైన్-2కే24ను ఏవో ఆర్వీ రమణారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈ మ్యాగజైన్‌లో 2024 జనవరి నుంచి 2024 డిసెంబరు 31 వరకు జరిగిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ ఎస్‌డీ ముజాహిద్దీన్, ఇతర కోఆర్డినేటర్స్ అన్ని విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిచ్చుకలు మానవులకు స్నేహితులని, పర్యావరణ సమతుల్యతకు పిచ్చుకలు ఎంతగానో దోహనపడతాయని అధ్యాపకులు వివరించారు. పిచ్చుకలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వేసవిలో వాటికి గూళ్లు, నీళ్లు ఏర్పాటుచేయటం ద్వారా కొంతవరకు పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు ఎన్వీ శ్రీహరి, సుజాత, పీ. రాజగోపాల్, తిరుపతిస్వామి, జ్యోతి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



బీమా పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్బీఐ ఆర్ఎం రాజేష్ తదితరులు

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్బీఐ (హైదరాబాద్) ఆర్ఎం రాజేష్ చెప్పారు.గురువారం లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకులు అందించే పీఎంఎస్‌బీవై, పీఎంజేజేవై, పీఎంఏపీవై, ఎస్ఎస్‌వై పథకాలను ఉపయోగించుకొని ఆర్థిక భద్రత పొందాలన్నారు.ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు, అవార్డు స్వచ్ఛంద్ర సంస్థ ప్రతినిధులు, శ్రీనివాసరావు రాజ్యలక్ష్మి, జామవా, వెలుగు సీసీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పునర్నిర్మాణానికి చర్యలు


పైకప్పు లేచిపోయి పిల్లర్లు మాత్రమే మిగిలి ఉన్న చెత్త సంపద కేంద్రం

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు.సుమారు పదేళ్ల క్రితం తాటాకుల కప్పుతో నిర్మించిన ఈ కేంద్రం పైకప్పు లేచిపోయి పిల్లర్లు మాత్రమే మిగిలాయి. ప్రస్తుత ప్రభుత్వ అధికారులు ఈ కేంద్రాన్ని సందర్శించి, పునర్నిర్మాణానికి 9 లక్షల రూపాయలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

పది మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బుడంగుంట గ్రామంలో గురువారం బెల్టుదుకాణంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో శెట్టిపల్లి ప్రేమ్‌చంద్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

గడ్డిచుట్టే యంత్రంలో చిక్కుకుని తీవ్రగాయాలు

కావలి రూరల్ : ట్రాక్టర్‌తో గడ్డి చుట్టే యంత్రంలో ప్రమాదవశాత్తు డ్రైవర్ వెంకటేశ్వర్లు చేయి చిక్కుకోవటంతో నుజ్జు నుజ్జు అయింది.ఈ సంఘటన గురువారం రాత్రి కావలి మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. ఆర్సీపాలెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు కొత్తపల్లిలో పొలంలో గడ్డిచుట్టే యంత్రంతో గడ్డి చుడుతున్నాడు. యంత్రంలో పురికొస చిక్కుకోవడంతో ఆయన యంత్రంలో చేయిపట్టి దాన్ని తీసే క్రమంలో మోచేతి పైవరకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కేకలు వేయడంతో స్థానికులు ట్రాక్టర్ ఇంజన్ ఆపి చేతిని బయటకు లాగారు. వెంకటేశ్వర్లును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

శిథిలభవనంలో గ్రంథాలయం



అల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని బాపూజీ పార్కులో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాత భవనం కావడంతో పైకప్పు దెబ్బతిని, వర్షానికి ఉరుస్తున్నది. అంతేకాక భవనం కూడా దెబ్బతిన్నది. దీంతో ఏ క్షణం ఏమవుతుందోనని సిబ్బంది, పాఠకులు భయంతో గడపాల్సి వస్తున్నది. అత్యధికులు బయటే కూర్చొని పత్రికలు చూడాల్సి వస్తున్నది. ఈ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మిస్తే పాఠకులకు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు.

పెరుగుతున్న రోడ్ల ఆక్రమణలు

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నా, అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముసునూరు బ్రహ్మంగారి గుడి నుంచి రైల్వే ట్రాక్‌కు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డుపై కట్టడాలు నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పట్టణ జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతున్నా, ఉన్న కొద్దిపాటి రోడ్లు కూడా ఆక్రమణలతో కుంచించుకు పోతున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.


ముసునూరులో సీసీ రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

ట్రాక్టరు ఢీకొని వ్యక్తికి గాయాలు

కావలి రూరల్, మార్చి(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్‌ను ట్రాక్టర్ వెనుక నుంచి ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ సంఘటన గురువారం పెద్దపవని రోడ్డులోని పీజీ సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, జలదంకి మండలం రామవరప్పాడుకి చెందిన దినేష్, మోసక్ లు మోటారు బైక్ పై కావలి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో బైక్ ట్రాక్టర్‌ను ఢీ కొంది.తీవ్రంగా గాయపడిన దినేష్‌ను ఏరియా వైద్యశాలకు తరలించి, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

చిట్టడవి కాదు.. జగనన్న లేఅవుటే..!

- లెవలింగ్, అంతర్గత రహదారుల ఏర్పాటుకు రూ.25 లక్షల వ్యయం
- ఇళ్లు నిర్మించకపోవడంతో చిల్లచెట్లతో నిండిన వైనం

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ సమీపంలో ఐదేళ్ల కిందట ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ చిల్లచెట్లతో నిండి చిట్టడవిని తలపిస్తోంది. లింగసముద్రం గ్రామ సర్వే నంబరు 40లో పశువుల మేతకు పోరంబోకుగా ఉన్న స్థలాన్ని రెవెన్యూ ఉన్నతాధికారులు కన్వర్షన్ చేసి సర్వే నంబరు 326గా మార్చి జగనన్న లేఅవుట్ కోసం ఎ4.70సెంట్లను కేటాయించారు. గ్రామంలోని 154మందిని పక్కా గృహాల లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఇందులో వారికి స్థలాలను కేటాయించారు. అయితే ఈ ఎ 4.70 సెంట్లలో జంగిల్ తీసి, చదును చేసి, అంతర్గత రోడ్లు ఏర్పాటు వేసేందుకు అధికారులు ఉపాధిహామీ పథకం నిధులు రూ.25లక్షలు మంజూరు చేశారు. దీంతో ఈ భూమిని చదును చేసి, అంతర్గత మట్టి రోడ్లను ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫా ర్మర్‌ను ఏర్పాటు చేసి వైరింగ్ కూడా లాగారు. అంతేకాక బోరు ఏర్పాటు కోసం కేసింగ్ పైపు అమర్చారు. గృహాలు మంజూరైన వారికి నిర్మాణానికి రూ.1.80లక్షలు మాత్రమే మంజూరు కావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. ఇందులో పట్టాలిచ్చిన లబ్ధిదారుల్లో కొందరు అనర్హులు కూడా ఉన్నారని ఆరోపణలున్నాయి. ఇరవై ఎకరాలు ఉన్నవారు, ఇంకా ట్రాక్టర్లు, కార్లు ఉన్న వారు కూడా ఉన్నారని విమర్శలున్నాయి. ఇందుకోసం భార్యకు ఒకటి, భర్తకు ఒకటి విడిగా రేషన్‌కార్డులు మార్చుకున్నట్టు తెలిసింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చిల్లచెట్లతో నిండిన జగనన్న లేఅవుట్

పెంచలస్వామి సేవలో సినీ గాయని ఎస్పీ శైలజ



పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ శైలజ

రాపూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన లక్ష్మీనర సింహ స్వామిని గురువారం సినీ గాయని ఎస్పీ శైలజ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గుండ్లూరు సీత రామయ్య స్వామి, శశి స్వామి తదితరులు పాల్గొన్నారు.





సీఎం నుంచి బహుమతి అందుకుంటున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

క్రీడా సంబరం

విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత జట్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- విజయవాడ (ఆంధ్రజ్యోతి)





కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి తదితరులు

మూల్యాంకనం నిబద్ధతతో చేయాలి

నెల్లూరు(విద్య) : ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన విధులను సిబ్బంది నిబద్ధతతో నిర్వహించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో గురువారం ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడారు. మొత్తం 750 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఏప్రిల్ మొదటి వారంలోగా స్పాట్ పూర్తవ్వాలన్నారు. శనివారం నుంచి కెమిస్ట్రీ, హిస్టరీ స్పాట్ కూడా ప్రారంభమవుతుందని చెప్పారు.

వ్వా.. హలీమ్!

- రంజాన్‌కు ప్రత్యేక వంటకం
- కులమతాలకు అతీతంగా పెరుగుతున్న ఆదరణ

రంజాన్ మాసంలో అందరికీ గుర్తుకు వచ్చేది హలీమ్. ముస్లిములే కాకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఈ హలీమ్‌ను ఆరగిస్తారు. ఎన్నో పోషక విలువలు కలిగిన ఈ హలీమ్‌ను నెల్లూరు నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా పట్టణాలలో విస్తృతంగా అమ్మకాలు సాగిస్తున్నారు. హైదరాబాద్ నిజాం సైన్యంలో చేరిన అరబ్ సైనికులు, నగరంలో స్థిర పడిన అరబ్బులు, పర్షియన్ల ద్వారా హలీమ్ మనకు పరిచమైందని చరిత్ర చెబుతోంది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

దక్షిణాసియా, మధ్య ఆసియాల్లో విస్తృతంగా వినియోగించే వంటకం హలీమ్. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు రోజంతా ఉప వాసం ఉండి సూర్యాస్తమయంలో అల్పాహారంగా హలీమ్‌ను తీసుకుంటారు. పోషకాలు మెండుగా ఉండటంతో ఈ వంటకం ఉపవాసంతో ఉన్నవారికి తక్షణ శక్తినిచ్చేలా పని చేస్తుంది. ఇక హలీమ్‌ను మటన్, చికెన్‌తో హలీమ్ తయారు చేస్తారు. వీటితోపాటు గోధుములు, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, శనగపప్పు, మినపప్పు, దనియాలు, జీలకర్ర, వాము, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నల్ల మిరియాలు, కుంకుమపువ్వు, రోజా పూల రెక్కలు, కొండ ఆకులు, పిస్తా, జీడిపప్పు, అంజీరా, బాదం ఇలా అనేక రకాల వస్తువులను హలీం తయారీలో వాడతారు. హలీమ్ తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. గోధుము లు, పప్పులు రాత్రంతా నానబెట్టి బాగా ఉడికిం చుకుంటారు. మటన్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన బట్టీలో ఆరేడు గంటల పాటు ఉడికిస్తూ గోటాతో కలియబెడు తుంటారు. పేస్ట్‌లా తయారై తర్వాత కొత్తిమీర, ఫ్రైడ్ ఉల్లిపాయలు, నిమ్మకాయ ముక్క గార్నిస్ చేసి విక్రయిస్తారు.



మెండుగా పోషకాలు

క్యాలరీలు అధికంగా ఉండే హలీమ్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది తక్షణమే శరీరానికి శక్తిని ఇస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం కారణంగా నెమ్మ దిగా జీర్ణం అవ్వడంతో పొట్ట ఎక్కువ సేపు నిం డుగా ఉన్నట్లు అనిపిస్తుం ది. హలీమ్‌లో డ్రైఫ్రూట్స్ చేర్చడం వల్ల శరీరానికి మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా అందుతాయి. గోధుములు ఉపయోగించడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుంది. హలీమ్ తయారీకి ఉపయోగించే మసాలా దినుసుల్లో పొటాషియం ఎక్కువగా ఉండటం తో అధిక రక్తపోటు, కిడ్నీ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది.

హైదరాబాద్ నుంచి మాస్టర్లు

హైదరాబాద్ మహానగరానికే పరిమితమైన హలీమ్ 2010 నుంచి నెల్లూరులో తయారుచేసి విక్రయిస్తున్నారు. 2012లో నగరంలో విక్రయ దుకాణాలు ప్రారంభమయ్యాయి. హలీమ్ తయారీ కోసం హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా మాస్టర్లను రప్పిస్తున్నారు. రంజాన్‌కు ముందే మాస్టర్‌లను అడ్వాన్స్ ఇచ్చి హలీమ్ విక్రయించే దుకాణదారులు రిజర్వు చేసుకుంటారు. రంజాన్ మాసం ప్రారంభమవుతున్న మూడు రోజుల ముందే నగరానికి మాస్టర్లు వస్తారు. ఉపవాస దీక్షలు పూర్తయ్యాక తిరిగి తమ ప్రాంతాలకు వెళుతారు. మాస్టరు, అసిస్టెంట్‌కు కలిసి నెల రోజులకు రూ.1.60 లక్షలకుపైగా ఇస్తున్నారు. అలాగే 2012లో 250 గ్రాముల మటన్ హలీమ్ రూ.60లకు విక్రయించే వారు. ప్రస్తుతం రూ.200 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు.



పూర్వీకుల నుంచి చేస్తున్నాం



మాది హైదరాబాద్. మా తాత, ముత్తాతల నుంచి హలీమ్‌ను తయారు చేస్తున్నాము. 2012 లో మొదటిసారిగా హలీమ్ చేసేందుకు నెల్లూరు కు వచ్చాను. అప్పటినుంచి ప్రతి సంవత్సరం నెల్లూరుకు వస్తూనే ఉన్నాను. హలీమ్ చేసే సమయంలో గంటల సమయం సెగలో ఉండాలి. అందుకే మజ్జిగ ఎక్కువగా తాగుతూ ఉంటాను. ఇప్పటివరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు. నెల్లూరు బిర్యాని నేను ఎంతో ఇష్టంగా తింటాను.

- ఎండీ సాధిక్ అలీ, హలీమ్ తయారీదారు

ఆదరణ పెరిగింది

2012 నుంచి హలీమ్‌ను నెల్లూరులో విక్రయిస్తున్నాను. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు హలీమ్ తినే వారి సంఖ్య బాగా పెరిగింది. అప్పట్లో రోజుకు ఐదు కేజీల హలీమ్‌ను విక్రయిస్తే ఇప్పుడు 40 కేజీలకు పైగా విక్రయిస్తున్నాము. హలీమ్ విక్రయించే దుకాణాల సంఖ్య నగరంలో బాగా పెరిగింది. మా దుకాణంలో కేజీ హలీమ్ కొనుగోలు చేసిన వారికి ఖుబాని స్వీట్, కూల్‌డ్రింక్‌ను ఉచితంగా ఇస్తున్నాము.



- ఎస్‌కె అఫ్రోజ్, అల్‌షాగౌస్ హలీమ్ దుకాణం యజమాని.

సోమశిల జలాశయంలో 54.780 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో మహిళా సాధికారిత

- నుడా చైర్మన్ కోటంరెడ్డి
- ముగిసిన వజ్రోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (విద్య), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : డీకేడబ్ల్యూ కళాశాలలో మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తూ మహిళాభ్యున్నతికి పాటుపడు తున్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల 60 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా రెండురోజులు నిర్వహించిన వజ్రో త్సవ వేడుకలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్ర మంలో నుడా చైర్మన్ మాట్లాడుతూ చదువు కున్న విద్యా సంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు పూర్తి సహ కారం అందించాలన్నారు. వేలాదిమంది విద్యార్థి నులు చదువుకునే ఈ కళాశాలకు తమవంతు పూర్తి సహాయ, సహకారాలు అందచేస్తామ న్నారు. విద్యార్థినులు అవకాశలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సోదరి, పూర్వ విద్యార్థిని విజయదుర్గ మాట్లాడుతూ పాత స్నేహితు లందరినీ కలుసుకుని జ్ఞాపకాలను గుర్తుచేసు కోవడం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అనంతరం విద్య, సాంస్కృతిక విభా గాల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత దొడ్ల కౌసల్యమ్మ సేవలను స్మరించు కుంటూ, కళాశాల అభివృద్ధి స్లోగన్‌లతో నగరంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ డి.గిరి, దివంగత ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సతీమణి, కళాశాల పూర్వ విద్యార్థిని హేమావతి, దొడ్ల కౌసల్యమ్మ మేనల్లుడు సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ మస్తా నయ్య, డాక్టర్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, పూర్వ విద్యార్థినుల సంఘం సభ్యులు జ్యోతిరెడ్డి, కుసుమ కుమారి, తుసలి, శేషమ్మ, జయలక్ష్మి. అధ్యా పక, అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత, పూర్వ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థినులు

నేతన్నకు భరోసా!

- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం
- జిల్లాలో 3,600 కుటుంబాలకు లబ్ధి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇప్పటికే చేనేతల ఇళ్లకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం తాజాగా దాన్ని 200 యూనిట్లకు పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం చేనేతలను నిర్లక్ష్యం చేసింది. ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. అంతేగాక నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24వేలు ఇచ్చారు. అదికూడా కొందరికే ఇచ్చి చేతులు దులుపు కున్నారు. ఉచిత విద్యుత్ హామీని తుంగలో తొక్కారు. అయితే కూటమి ప్రభుత్వం రాకతో చేనేత కుటుం బాల్లో వెలుగులు వస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 100 యూని ట్లలోపు వాడిన వారు బిల్లు చెల్లించా ల్సిన అవసరం లేకుండా ఆదేశాలు జారీ చేసింది. తాజాగా దాన్ని 200 యూనిట్లకు పెంచింది.



మగ్గం నేస్తున్న మహిళ

ఉచిత విద్యుత్‌తో ఆర్థిక భరోసా



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పటికే 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందు తోంది. తాజాగా 200 యూనిట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. అయితే దీనిపై అవగాహన కల్పించాలి. అర్హులైన చేనేతలు దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలి.

- బుధవరపు బాలాజీ, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు

దరఖాస్తు చేసుకోవాలి!

జిల్లాలో దాదాపు 3600 చేనేత కుటుంబాలు ఉండగా, మరో 6వేల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. సంగం, కోవూరు గమళ్లదిబ్బ, పాటూరు, నెల్లూరు రూరల్ నారాయణరెడ్డిపేట, సౌత్‌మోపూరు, ములుముడి, బుచ్చి, ఇందుకూరుపేట, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు అర్హులే. అయితే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మగ్గాలు ఉన్న కుటుంబాలకు మాత్రమే 100 యూనిట్లలోపు విద్యుత్ వాడితే బిల్లు పూర్తిగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అవకాశాన్ని ఇప్పటికే జిల్లాలో 206 మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. చేనేత గుర్తింపు కార్డులతో దరఖాస్తులు చేసుకుంటే ఈ లబ్ధి చేకూరుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం తీసుకున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిర్ణయం ద్వారా జిల్లాలో దాదాపు 3600 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే 206 కుటుంబాలు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. చేనేత గుర్తింపు కార్డుతోపాటు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి నేతన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పి.వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి

పరిశ్రమల స్థాపనకు వెంటనే అనుమతులివ్వాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ భవన్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల ఏర్పాటు అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువు కంటే ముందుగానే అనుమతులు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణను వేగంగా చేపట్టాలన్నారు. ఎంఎస్‌ఎంఈలకు అవసరమైన పీఎంఈజీపీ రుణాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డ్వామా పీడీ గంగా భవానీ, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్టలో మెరిసిన ఆణిముత్యం

గేట్‌లో 425వ ర్యాంకు సాధించిన శేఖర్



ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గేట్ పరీక్షా ఫలితాల్లో ఉదయగిరి మండలం జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన దేవండ్ల శేఖర్ ఆలిండియా స్థాయిలో ఈసీఈ విభాగంలో 425వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గ్రామానికి చెందిన దేవండ్ల వెంకటేష్, నరసమ్మల కుమారుడు శేఖర్. తండ్రి చిన్నతనంలోనే అనారోగ్యంతో చనిపోవడంతో తల్లి కూలి పనులు చేసి చదివించింది. శేఖర్ ప్రాథమిక విద్య గ్రామంలో పూర్తి చేయగా, 6 నుంచి 10వ తరగతి వరకు నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాల, బీటెక్ జేఎన్‌టీయూ కలికిరిలో పూర్తి చేశాడు. చిన్నతనం నుంచే శేఖర్ విద్యలో రాణిస్తున్నాడు. పదో తరగతిలో 9.5 జీపీఏ, ఇం టర్‌లో 958 మార్కులు, ఎంసెట్ 13790 ర్యాంకు సాధించాడు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా గేట్ పరీక్షలు రాసి తొలి ప్రయత్నంలోనే 425వ ర్యాంకు సాధించి తన ప్రతిభ చాటాడు. ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగం సాధించడమే తన ధ్యేయమని శేఖర్ పేర్కొన్నాడు.

అటవీ పనుల ధర 4.36శాతం పెంపు

- ఎఫ్ఎస్ఆర్ జోనల్ కమిటీ చైర్మన్ రాజు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ ద్వారా చేపట్టే పనులకు సంబంధించిన ధరలను రాబోవు ఆర్థిక సంవత్సరానికి 4.36 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు గుంటూరు సర్కిల్ కన్జర్వేటర్, ఎఫ్ఎస్ఆర్(ఫారెస్ట్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) కమిటీ చైర్మన్ ఐకేవీ రాజు పేర్కొన్నారు. నెల్లూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో గురువారం రాష్ట్ర అటవీశాఖ జోన్-4 ఎఫ్ఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ రాజు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నిర్వహించే కమిటీ సమావేశం ఈసారి డీఎఫ్‌వో మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించామని చెప్పారు. అటవీశాఖ ద్వారా జరిగే పనులకు సంబంధించి 2025 - 26 సంవత్సరానికిగాను ప్రస్తుత ధర కంటే 4.36 శాతం పెంచామన్నారు. ఎలాంటి పనులు చేపట్టాలన్నా కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కన్జర్వేటర్లు యశోదబాయి, కృష్ణమూర్తి, సెల్వం, నరనీతరన్, సాయి బాబా, డీఎఫ్‌వోలు మహబూబ్ బాషా, ధర్మరాజు, నాగార్జున్ రెడ్డి, హారిక పలువురు రేంజర్లు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్వో అంకయ్య ఓ ప్రకటనలో కోరారు. రేషన్ కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ, రేషన్ డీలర్ వద్దగానీ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

సంగంలో 'అసుర సంహారం' సందడి

- సినీ షూటింగ్‌లో పాల్గొన్న తనికెళ్ల భరణి

సంగం/బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'అసుర సంహారం' సినిమా షూటింగ్ గురువారం సంగం, బుచ్చిరెడ్డిపాళెంలలో జరిగింది. తొలుత ఓ సన్నివేశాన్ని చిత్రీకరించేందుకు డైరెక్టర్ కృష్ణ కిషోర్‌తో కలిసి ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి సంగమేశ్వరాలయానికి వచ్చారు. సమాచారం అందుకున్న ప్రజలు తనికెళ్ల భరణిని చూసేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో సంగం శివాలయంలో సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన ఆయన మొదట సంగమేశ్వరుడిని, శ్రీ కామాక్షిదేవిని దర్శించుకున్నారు. అనంతరం చిత్రం షూటింగ్‌లో భాగంగా డైరెక్టర్ తనికెళ్ల భరణితో ఒక సన్నివేశం చిత్రీకరించారు. తరువాత సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడ సబ్బు ప్రవీణ్ కుమార్ డైరెక్టర్ కృష్ణ కిషోర్‌కి చిన్ననాటి స్నేహితుడు. దీంతో సంగంలోని ఆయన ఇంటికి వెళ్లి తనికెళ్ల భరణితో మరో సన్నివేశం చత్రీకరించారు. అలాగే బుచ్చిరెడ్డి పాళెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోనూ ఈ సినిమా షూటింగ్ జరిగింది.



సంగం శివాలయంలో షూటింగ్‌లో పాల్గొన్న తనికెళ్ల భరణి